# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

తెలుగులో
వెలువడుతున్న
ఏకైక
హాస్య మాస పత్రిక


నవంబర్-2022

వెల: రూ.20



తాంబూల చర్వణ వ్రతం
ఎవరు చేయాలి?





చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

నవంబర్-2022

20వ సంవత్సరం

221 వ సంచిక

నవ్వే
నవనాడులకు
ఇంధనం

*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P*:
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

**సంవత్సర చందా-రూ.300/-**
(పోస్టల్ చార్జీలతో)

**2 సంవత్సరాల చందా-రూ.500/-**
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.



ముఖచిత్రం:
మహిమా నంబియార్

కార్టూన్: నాగిశెట్టి

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
G.venkat Reddy,
Dr. Rama Kumar
*Cartonist* JSR,
K.Sundaresayya&
Satyavathi,
J.Nageswara Rao,
T.R.Babu

*Creative Team*
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar
Sangram
Krishna
Bomman
GopalKrishna
Venkat
Ramsheshu

గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

**ఆనందానికి కారణం- నవ్వు!... నవ్వుకి కారణం హాస్యానందం!**

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు...


| | | |
|---|---|---|
| స్వీట్ బాక్స్ | -గంగాధర్ వడ్లమన్నాటి | -13 |
| బుడుగు పార్టీకి వెళ్లిన కథ | -కె.ఎన్.వి.ఆంజనేయులు | -16 |
| కాశీయాత్ర | -ఎన్.బి.యస్.శ్రీనివాస్ పోలిశెట్టి | -22 |
| నేటి సాధువు | -కందర్ప మూర్తి | -28 |
| ఘన సన్మానం | - డి.వి.డి.ప్రసాద్ | -34 |
| తగ్గేదేలే... | -డా॥ శ్రిష్టి శేషగిరి | -38 |
| ముక్కు పుడక | -ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | -40 |
| తొంగితొంగి చూడు చందమామ | -యలమర్తి చంద్రకళ | -43 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| 'పన్'చదార చిలుకలు | -శంకరనారాయణ | -7 |
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -10 |
| నవ్వించే రాగాలు | -ఎన్.పి.ఎస్.రావు,విట్టుబాబు | -12 |
| బాచి కార్టూన్‌కి కథ | -డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం | -21 |
| ఫన్‌పంచ్ | -గుండు సుదర్శన్ | -26 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -31 |


## స్పెషల్స్


| | | |
|---|---|---|
| ఫేస్‌బుక్ ఫ్యాన్స్ | -శర్మ | -20 |
| బాలల దినోత్సవం | -చక్రవర్తి | -30 |
| రిలీఫ్ | -దయాకర్ | -50 |


## సీరియల్


| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కంఠ్లకుంట శరత్‌చంద్ర | -46 |


### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -17 |
| లోకంతీరు | -కృష్ణ | -18 |
| బాలి కార్టూన్‌కి క్యాప్షన్ | | -19 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -25 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -32 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -36 |
| నచ్చిన కార్టూన్‌కి కానుక | | -37 |
| నవ్వేమందు | -ప్రసిద్ధ | -42 |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | -48 |
| ఫొటోటూన్ | -రఘు | -49 |














### ఈ సంచికలో కార్టూనిస్టులు

- రామకృష్ణ
- జయదేవ్
- సరసి
- ఏవీఎమ్
- బాచి
- గాంధీ
- గోపాలకృష్ణ
- నాగిశెట్టి
- దయాకర్
- రామ్‌శేషు
- ప్రసాద్ కాజ
- డి.శంకర్
- శ్రీ
- శర్మ
- వర్మ
- టి.ఆర్.బాబు
- చక్రవర్తి
- సునీల్
- బొమ్మన్
- శంబంగి
- క్రిప్
- వందన శ్రీనివాస్
- ప్రేమ్
- తోపల్లి ఆనంద్
- ఎన్.పి.ఎస్.రావు
- పెండేల
- రంగాచారి
- రఘు
- శేఖర్‌బాబు
- సురేంద్ర
- డేవిడ్
- ఎమ్.ఎ.రవూఫ్
- నాథ్
- శేషగిరి
- సౌమ్య
- సత్య
- కన్నాజిరావు
- శేఖర్
- ఉత్తమ్
- నిరంజన్
- పూర్ణ
- సీతారామ్
- సి.ఎస్.కె.

## హాయ్...సానందంగా...




**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు,**
**సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

ఆపరేషన్ సక్సెస్ బట్ పేషంట్ డైడ్!... మనం చాలా సరదాగా ఈ మాటని ఎదుటివాళ్ళ విషయంలో తరచుగా వాడేస్తుంటాం! కానీ ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవసిన మాట ఇది! మనం చేసే పనులు సిన్సియర్‌గా, ఎవరికోసమో అని కాకుండా మన కోసమే అనుకొని చేద్దాం!...సకాలంలో జరగకపోతే ఆ పని తాలూక ఫలితం తారుమారు కావచ్చు! ఉదాహరణకి మనం ఆదరాబాదరాగా తయారయ్యి, పరుగెత్తుకుంటూ, రొప్పుతూ రైల్వేస్టేషన్‌కెళ్ళే సరికి ట్రైన్ వెళ్ళిపోతుంది... ఎక్కడుంది సమస్య?! ఇది మనం ఆలోచించాల్సింది! శ్రద్ధ లేకుండా తప్పనిసరిగా చేసే పనుల పర్యావసానం ఇలానే ఉంటుంది. ఇంటిపనిలో అయినా, ఆఫీసుపనిలో అయినా, చదివే చదువైనా ఏదో చేసేశాం అని కాకుండా మనసు పెట్టిచేస్తే కచ్చితంగా ఫలితం మనకు ఆనందాన్నిస్తుంది. పని చేసేటప్పుడు కష్టంగా ఉండొచ్చు గాక... షార్ట్‌కట్‌లో తొందరగా చేసేద్దాం అనుకుంటే మాత్రం ఆ 'ఆనందం' మన సొంతం కాదు! మనం ఏ పని చేసినా చిన్నపాటి ప్రణాళికతో చేస్తే సకాలంలో అవడమేకాక పరిపూర్ణంగా పూర్తవుతుంది. తప్పనిసరి అనుకున్నప్పుడు ఆ పనిని శ్రద్ధగా చేయాల్సిందే! ఖర్మకాలి ఈ పని చేస్తున్నామనుకొంటూ చేస్తే మనం పడిన శ్రమ వృధా అవడమే కాకుండా చేసిన ప్రయత్నం ఫలించదు! సరియైన సమయానికి... చిత్తశుద్ధితో పనులు చేద్దాం! ఫలితాలను ఆనందంగా అనుభవిద్దాం! ఈ జీవితం మనది! ఇందులో వచ్చే కష్టసుఖాలకి బాధ్యులం మనమే అని గుర్తెరిగి ప్రవర్తిద్దాం! మంచి మాటలు ఎవరు చెప్పినా ఆనందంగా స్వీకరిద్దాం... పాటించడానికి ప్రయత్నిద్దాం! చూద్దాం... ఆనందం మన వెంట ఎందుకు రాదో!

అందరూ హాయిగా... ఆనందంగా... ఆరోగ్యంగా...
ఉండాలని కోరుకుంటూ.....

Ramu.P






✦ **పి.వాసుదేవరావు,సికింద్రాబాద్**

అన్ని ఇళ్ళు, ఆఫీసులు, విద్యాకేంద్రాలు, హాస్యానందం మాస పత్రిక తెప్పించి... అందరిచే చదివిస్తే...ప్రశాంతమైన మనసులతో, తేలికైన భావనలతో, వందశాతం సంతోషపూరిత నిర్వాహకము మరియు మంచి ఆనందకర వాతావరణం నెలకొలిపే వారౌతారు.

✦ **వి.శ్రీప్రియ,ముంబై**

**9** కథలతో, 78 కార్టూన్లతో... నవ్వుల జువ్వలు ప్యాక్‌చేసిన అక్టోబర్ హాస్యానందం మా మనసుల్ని దోచుకుంది.మొదటి పేజీలో చెప్పినట్లు 'ఆనందం ఆయురారోగ్యాలకు అభయం' అన్న మాట నిజం! హాస్యంతో ఆనందం పంచుతున్న మా హాస్యానందంకు ఇవే మా అభినందనమందారమాల!




✦ **పి.శ్యాంకుమార్, నెల్లూరు**

అక్టోబర్ 'హాయ్...సానందంగా'లో ఎడిటర్‌గారు చెప్పినట్లు- 'రోజూ కాకపోయినా, ముఖ్యమయిన రోజుల్లో అయినా అయినవాళ్ళందర్నీ పలకరించుకుందాం!' బాగుంది. అందరూ కలిసి జరుపుకునే పండుగే నిజమైన పండుగ! కార్టూన్లు, కథలే కావు ఆనందహేతువైన జీవనవిధానాన్ని విశదపరుస్తున్న మీ ఆలోచనలు నిజంగా సూపర్ సార్! మా ఆనందానికి కారణం- నవ్వు ! నవ్వుకి కారణం హాస్యానందం!

✦ **డా॥ఎస్.కిరణ్ కుమార్, రాజమండ్రి**

మీకొక విన్నపం! హాస్యానందం గురించి ప్రతి పేజీని సమీక్షిస్తూ ఒక పది పేజీలు రాసి పంపుతా... ప్రచురిస్తారా? హాస్యం... ఆనందం మనుషులకు ఎంత ముఖ్యమో అందరికీ తెలుసనుకుని భ్రమపడుతున్న భావన! నిజంగా మనం ఆనందంగా కాలం గడుపుతున్నామా? హాయిగా నవ్వుకుంటున్నామా? ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్నలు ఇవి! నవ్వుకు దూరమైపోతున్న మనకు నెలనెలా మన నవ్వుకోసమే వస్తున్న హాస్యానందం నిజంగా మనకు వరం! దీన్ని కాపాడుకుందాం! ఆనందాన్ని 'కొని' తెచ్చుకుందాం!

✦ **బి.కృష్ణకుమారి,కావలి**

గుండు సుదర్శన్‌గారి పంచ్ సమాధానాలు భలేగా ఉంటున్నాయి. ఈనెల డాక్టర్ రాంకుమార్‌గారి ప్రశ్నలకు ఆయన సమాధానాలు సూపర్! ఆ రెండు పేజీలు నిజంగా సెంట్రల్ అట్రాక్షనే! పత్రికని ఇంత నీట్‌గా...ప్రాంప్ట్‌గా వెలువరుస్తున్న మీకు మా అభినందనలు. ఏ మాత్రం అసభ్యత లేకుండా ప్రచురిస్తున్న కథలు, కార్టూన్లు మీ సంపాదకత్వానికి నిదర్శనాలు! ఎల్లప్పుడూ హాస్యానందం ఇలానే మమ్మల్ని అలరించాలని మా ఆకాంక్ష!

✦ **ఎమ్.హిమబిందు, విశాఖపట్టణం**

హాస్యానందం మా ఇంటిల్లీపాదికి ప్రియమైన పత్రిక అయిపోయింది. నవ్వులు కరువైపోతూ...వెకిలి నవ్వులు పెరిగిపోతున్న ఈ రోజుల్లో హాస్యానందం మాకు గొప్ప ఊరట!... వర్ధిల్లు హాస్యానందమా!

మహా మహుల కలయికతో... హాస్యామృతం కురిపిస్తూ ఆనందాన్ని కలిగిస్తూ, ఉత్తేజపరుస్తూ, మోదం పంచుతూ, చిరునవ్వులు పూయిస్తున్న...హాస్యానందమా! జయహో!!

—నిమ్మగడ్డ కృష్ణ,హైదరాబాద్

**అసలు టానిక్**

కొందరి ముఖాల మీద నవ్వుల పువ్వులు పూయవు
బతుకులో ఏనాడూ ఆనంద పరిమళాలు వీయవు
సంపాదనలో మునిగిన లోకులకు
రుచించవు ఏనాడూ జోకుల కేకులు
ముఖాల మీద నవ్వులు వాలకపోవడమే
వచ్చిన పెద్ద చిక్కు
మనలోని రుగ్మతలు పోగొట్టడానికి
హస్యానందమే కదా గొప్ప టానిక్!

—చింతా అప్పల నాయుడు, పార్వతీపురం

**సృష్టిలో నవ్వే లక్షణం ఉంది ఒక్క మనిషికే!**
**దాన్నలా మరుగున పడేయకండి!**
**ఆ 'సవాలక్ష' కారణాలని**
**మరుగున పడేయడానికి**

హాస్యానందం

**చందాదారులుగా చేరండి...**
**ఆరు రుతువుల్లో నవ్వుల ఆమనిని ఆస్వాదించండి!**

| సంవత్సర చందా- రూ 300/-లు | రెండేళ్ళ చందా- రూ 500/-లు |
| --- | --- |

**జీవితచందా- రూ 5000/-**






# 'పన్'చదార చిలుకలు

'హాస్య[బహ్మ' డా॥ శంకరనారాయణ

*Cartoons: Ramseshu*




ఆడవాళ్ళు 'పట్టు' వదలని వి[క్రమార్కిణులు.



ఇబ్బడి ముబ్బడిగా సంపాదించాలంటే వెనుకబడి ఉండటం అవసరం!



చెట్టు నీడన కూర్చోవడమూ '[టీ'ట్మెంటే!



వెండితెర ఇచ్చేది 'బంగారు' భవిష్యత్తు

వేలుపోసి చదువుకొనేవాడు ఇప్పటి విద్యార్థి... వేలు 'కోసి' చదువు కున్నవాడు ఏకలవ్యుడు!





పిల్లల కొట్లాటలు బుల్లికజ్జాలు!





ఇంటర్నెట్ 'విశ్వమేథ యాగం'



అన్నింటిలోకి విద్యుత్- 'పవర్'ఫుల్



మద్యపానం మందుబాబులకు 'పాన'పదం!



చీమలు, పాములు కోరుకుంటాయి 'పుట్ట'గతులు!

వె[ర్రి... వేయి విధాలు! వ[రీ ... లక్ష విధాలు!





సాఫ్ట్‌వేర్ అమ్మాయి 'జావ'రాలు!

గాడిద గుడ్డు అనేవాడు కుసంస్కారి గాడ్ ద గుడ్ అనేవాడు సంస్కారి!



సుత్తి పాటలు పాడితే... 'స్వరమేథం!'





# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొంతమంది **కార్టూన్ ఇష్టులు**
**ఒక మంచి కార్టూన్‌కి రూ.500/-లు** బహుమతిగా ఇస్తున్నారు.




కార్టూన్ ఇష్టులు
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ రెండు కార్టూన్‌లకి**
**500 రూపాయలు చొప్పున**
**రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.








చిత్రకారులు
**శ్రీ జె.నాగేశ్వరరావు గారు**
**ఈ కార్టూన్‌కి**
**రూ.500/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.






కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్.
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి**
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్టులపై
ప్రేమతో, వాత్సల్యంతో
**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






రామకృష్ణ ఫౌండేషన్
సమర్పించు కార్టూన్



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## కక్కుర్తి కి దారేది?

**ఆ** కాలనీలో జనాలు కక్కుర్తి అలియాస్ గ్రీడీ గురించి మాట్లాడుకుంటే కచ్చితంగా చలపాయ్ గురించి మాట్లాడుకుంటారు.

చలపాయ్ లైఫ్‌లో జరిగిన కక్కుర్తి సంఘటనలు చెప్పాలంటే చాలా చెప్పాలి. అన్నీ చెప్పాలంటే చాలా టైం పడుతుంది. అందుకే మచ్చుకు ఓ ఇన్సిడెంట్ చెబుతాను.

పెట్రోల్ రేట్లు పెరిగాక చలపాయ్ వెహికల్‌ని వాడడం మానేసి, రోజూ ఆఫీస్‌కు నడుచుకుంటూ వెళ్ళి వస్తున్నాడు.

అలా ఓ రోజు ఆఫీస్ నుండి చలపాయ్ ఇంటికి వస్తూ, వెహికల్స్ మీద వెళ్ళేవాళ్ళని లిఫ్ట్ అడుగుతూ, నడుచుకుంటూ వస్తున్నాడు.

ఎవరూ లిఫ్ట్ ఇవ్వకపోవడంతో వాళ్ళని మనసులో అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్‌లో తిట్టుకుంటూ వస్తున్నాడు.... ఇంతలో తన ఫ్రెండ్ సోంబాబు కనిపించాడు.

"ఏంటీ ఇక్కడున్నావ్?" అని సోంబాబుని అడిగాడు చలపాయ్.

అక్కడ దగ్గర్లో నిలబడి వున్న ఓ అమ్మాయిని చూపించి– "ఆ ముంబై పిల్ల రస్నా ఇందాకే పరిచయం అయింది. హోటల్ రూమ్‌కు వెళ్దామంటే తను అక్కడికైతే రానని... మా ఇంటికి తీసుకెళ్ళమంటోంది." అన్నాడు సోంబాబు.

"మరి తీసుకెళ్ళు!" అన్నాడు చలపాయ్.

"ఎలా తీసుకెళ్ళాలి?...మా ఆవిడ ఇంట్లో వుంది!" అని నీరసంగా అన్నాడు.

"నువ్వా ఆ పిల్లని హోటల్‌కే వెళ్తే ఎంత ఖర్చు అవుతుంది?" అడిగాడు చలపాయ్!


"ఐదు వేలు!" అన్నాడు సోంబాబు.

"ఆ ఐదు వేలు నాకు ఇచ్చావనుకో... నువ్వా ఆ పిల్ల మా ఇంటికి వచ్చి రాత్రంతా వుండి వెళ్ళచ్చు" అని అన్నాడు చలపాయ్.

"మీ ఆవిడ ఇంట్లో లేదా?" డౌట్ అడిగాడు సోంబాబు.

"వుంది! అయినా నో ప్రాబ్లం! నా భార్య ఎర్రిబాగుల్ది. నేను ఏం చెప్పినా నమ్మేస్తుంది... మీరిద్దరూ భార్యా భర్తల్లా మా ఇంటికి వచ్చేయండి. మిగతాది నేను చూసుకుంటా!" అని,

"మీరు సినిమాకు వెళ్ళి... మీ ఇంటికి వెళ్ళి చూసుకుంటే... మీ ఇంటి తాళాలు ఎక్కడో పోయాయి. ఈ విషయాన్ని నాకు నువ్వు ఫోన్ చేసి చెబితే, ఈ రాత్రికి మిమ్మల్ని మా ఇంటికి రమ్మన్నాను. మీరు వచ్చారు. నా భార్యతో ఇదే చెబుతాను. మీరూ అదే చెప్పండి!" అని చలపాయ్ తన మాస్టర్ ప్లాన్ క్లిస్టర్ క్లియర్‌గా వివరించాడు.




అడ్వాన్స్ రెండువేలు ఇస్తూ– "మీ ఆవిడకు డౌట్ రాదుగా?" అన్నాడు సోంబాబు.

"మా ఆవిడ ఎంత తింగరబుచ్చి అంటే మొన్నా మధ్య నలుగురు కుర్రాళ్ళు నాకు ఐదొందలు ఇచ్చి మా ఇంట్లో మందు పార్టీ చేసుకున్నారు... వాళ్ళు తాగింది కూల్ డ్రింక్ అని చెప్పాను... నమ్మేసింది!" అని సోంబాబు అడ్వాన్స్‌గా ఇచ్చిన డబ్బు జేబులో పెట్టుకుంటూ– "నువ్వా ఆ పిల్ల హోటల్లో భోంచేసి, రాత్రి తొమ్మిది కల్లా మా ఇంటికి వచ్చేయండి. నేను వెయిట్ చేస్తుంటా!" అని వెళ్ళిపోయాడు చలపాయ్.

రాత్రి తొమ్మిది అవుతుండగా చలపాయ్ ఇంటికి సోంబాబు, రస్నా వచ్చారు. చలపాయ్ తన భార్య సావిత్రిని వాళ్లని పరిచయం చేశాడు.

ఆ తర్వాత వాళ్లకి కేటాయించిన బెడ్‌రూమ్ లోకి చలపాయ్, రస్నా వెళ్లారు.

టిఫిన్ పెట్టాల్సిన అవసరం లేకుండా వాళ్ళని పొద్దున్నే లేపి, పంపేసి అప్పనంగా ఐదు వేలు వచ్చినందుకు చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాడు చలపాయ్.

ఇలా వుండగా ఓ రోజు చలపాయ్ ఆఫీస్ నుండి ఇంటికి వచ్చేసరికి భార్య సావిత్రి బాత్ రూమ్‌లో నుండి గట్టిగా అరుస్తూ వుంది.

డోర్ తీసి ఏమైంది అని అడిగాడు.

"మీరు ఆఫీసుకు వెళ్ళాక మీ ఫ్రెండ్ భార్య రస్నా వచ్చింది. కాసేపు మాట్లాడక, నేను బాత్‌రూమ్‌కి వెళ్లాను. అంతే నన్ను లోపల పెట్టి బయట గడియ పెట్టుకుని వెళ్ళిపోయింది." అని చెప్పి అనుమానంగా బీరువా ఓపెన్ చేసి చూసింది. అందులో వున్న డబ్బూ, నగలూ, పట్టు చీరలు లేవు.

చలపాయ్ ఇంటి బయటికి వచ్చి సోంబాబుకి ఫోన్ చేసి జరిగిన దుర్ఘటన చెప్పకుండా–

"రస్నా ఇప్పుడు ఎక్కడుంది?..." అని అడిగాడు.

"ఇందాకే ముంబాయ్ వెళ్తుంటే ఎయిర్ పోర్ట్‌కి వెళ్లి డ్రాప్ చేసోచ్చాను... అట్నుంచి అటే దుబాయ్ వెళ్తాను అని చెప్పింది." అని,

"ఏరా!... నీకు కూడా ఆ పిల్ల మీద మనసు మళ్ళిందా?" అని సోంబాబు అంటుండగా... అసలు విషయం చెప్పకుండా కాల్ కట్ చేశాడు చలపాయ్.

ఇంతలో సావిత్రి ఏడుపు స్వరం ఇంకాస్త పెరగడంతో...

ఇంట్లోకి వెళ్ళే ధైర్యం లేక అక్కడి నుండి బయటికి పారిపోయాడు చలపాయ్.

## డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి)ఆశీస్సులతో
## గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో
## నిర్వహిస్తున్న కార్టూన్ పోటీలు



శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను
ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.
కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

| | |
|---|---|
| **మొదటి బహుమతి** | -రూ.3000/-లు + మెమెంటో + సర్టిఫికెట్ |
| **రెండవ బహుమతి** | -రూ.2000/-లు + మెమెంటో + సర్టిఫికెట్ |
| **5 ప్రత్యేక బహుమతులు** | -రూ.1000/-లు ఒక్కొక్కరికి + మెమెంటో+ సర్టిఫికెట్ |

అంశం ఏదయినా అవచ్చు.
బహుమతుల ప్రదానోత్సవ సభ జనవరి 2023 లో హైదరాబాదులో జరుగుతుంది.


**కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2022**
**ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-hasyanandampoteelu@gmail.com**

**వివరాలకు : 9849630637, 9849882783**

### సప్తతీయని రాంపా!



నలుగురు కలిస్తే చాలు సరదా మాటలతో నవ్వులు పంచుతూ... పలు కళల్లో ప్రతిభ చూపిస్తూ... నాదేం లేదు అంతా స్వామి దయ అనే దేవ సేవకుడు... ఎప్పుడూ తన గురించి ఎక్కువ చెప్పుకోని సల్లీలంతో అలరారే రాంపాలాంటి వాళ్ళు యింకెవరా అని వెతికితే ఎవరూ కనిపించరు అని అభినందిస్తే చిరునవ్వునిచ్చే వాడు... తెలుగువాళ్ళు ఆనందంగా చెప్పుకోవాల్సినవాడు...**రాంపా!**
రేపు నవంబర్ 29కి 70 దాటుతున్నాడు...
గౌతమి ఎన్‌క్లేవ్(AMB Mall Road) కొండాపూర్, హైదరాబాద్‌లో నలుపు తెలుపులా చిత్రకళా కార్టూన్ ప్రదర్శనతో... రెండు పుస్తకాల ఆవిష్కరణతో పిలుపు యిస్తున్నాడు ఆత్మీయులకు. సమాచారం ఏమైనా కావాలంటే ఈ నెంబరుకి ఫోన్ చేయండి- **9849863672**





హాస్యానందం సౌజన్యంతో
**శ్రీ బాబు కొయిలాడ గారు,**
తమ తండ్రి
**శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారి**
పేరిట నిర్వహించిన
ఉత్తరాల పోటీ ఫలితాలు,
గెలుపొందిన ఉత్తరాలు
**జనవరి,2023 సంచికలో**
**ప్రచురించబడతాయి.**

# నవ్వించే రాగాలు

క్షణ క్షణం చిత్రంలోని
'జాము రాతిరి జాబిలమ్మా...' పాటకి పేరడీ!

**-ఎన్.పి.ఎస్.రావు, న్యూజిలాండ్**



**అ**ర్ధ రాతిరి ఓరి బాబూ.. గురక పెట్టకూ ఇలా...
నిద్ర పట్టకా రెస్టు దొరకకా.. దొర్లుతుంటినీ అలా...
ముయ్ లేను నేను ఇపుడు కళ్ళు...
కోపంతో మండుతోంది వొళ్ళు...
నీ సౌండ్ రేగి పోవు వేళా... ॥**అర్ధ రాతిరి ఓరి బాబూ...**॥

**చరణం:** నోటిలో ప్రవేశించే గాలినే...
గురకగా నువే మార్చీ వేయగా..
గురకలో సవాలక్షా శృతులతో...
నరకమే ఇలా నువ్వా చూపగా..
కునుకు రాక కదలనంది నాకు సమయమూ..
వినక తప్పదింక నాకు కరకు శబ్దమూ....
॥**అర్ధ రాతిరి ఓరి బాబూ...**॥

**చరణం:** విసుగుతో నిన్నో సారీ కదిపినా...
ముసుగునే తన్నేసీ ట్రై చేసినా..
తలగడా చెవుల్నిండా మూసినా...
మగతలో ఒకే నిమిషం కునికినా..
కచేరీగ సాగుతున్న గురక ధాటికీ..
కరిగి పోక తప్పదమ్మ నిదుర మత్తుకీ..
అర్ధ రాతిరి ఓరి బాబూ... గురక పెట్టకూ ఇలా...
నిద్ర పట్టకా రెస్టు దొరకకా... దొర్లుతుంటినీ అలా...
ముయ్ లేను నేను ఇపుడు కళ్ళు కోపంతో మండుతోంది వొళ్ళు...
ఆ సౌండ్ రేగి పోవు వేళా...

# టీ శతకం

**-విట్టుబాబు**

మత్తుకుఁ జిక్కఁదనానికి
చిత్తమునకు వచ్చునట్లు చేర్చుచునేవో
సొత్తుకు నమ్మిన వణిజులు
చిత్తైతిమి నిన్ను గ్రోలి చేదువు ధమ్ 'టీ'. ॥77॥

పర్వంబులఁ బాయసమున్
గర్వంబున నీల్గుచుండుఁ గనువిందనుచున్
పర్వంబొకటె తనకు ని
ర్గర్వీ! నినుఁ బ్రతిదినమ్ముఁ గాచెదరే 'టీ'. ॥78॥

వార్వపువు టగ్గి మ్రగ్గుచు
సర్వులకున్ శ్రేయమొసగు సంతప్తరుజా!
ఉర్వీజజాతిఁ బుట్టియు
నుర్వీధరమంత కీర్తి నొందితివే 'టీ'. ॥79॥

ఏకాంతముగాఁ గూర్చొని
యో కప్పెడు నిన్నుఁ గ్రోల నొప్పులకుప్పా
శ్రీకరములు శుభకరములు
సాకారములగును గాదె స్వప్నములున్ 'టీ'. ॥80॥

పలువిధ దీక్షలు ప్రబలెను
బలువురు దేవతల పేర, వలువల పేరన్!
ఇలలో నీ సేవనమే
తొలినుండియు నాదు దీక్ష! తూకొంటిని 'టీ'. ॥81॥

పానీయంబుల చెంబులు
నా నియతిని గూల్చలేవు నాణ్యపు ద్రవమా!
తేనీరా! ఛాయీ! యని
నీ నామమె భజన సేతు నిత్యము నే 'టీ'. ॥82॥

సెహబాసు చారుశీలా!
మొహమాటమునైన గొనిన మోహము పుట్టున్
బహువిధ రూపంబుల నీ
యిహలోకపు వర్తనమ్ము నేమందును 'టీ'. ॥83॥

నిను నమ్మినవారలె నీ
ఘనమగు సహకారమె తమ గతచరితముగా
వినుతికి నెక్కిరి, భారత
జననాయకులైరి, మాకు జయమిమ్మా 'టీ'. ॥84॥

గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969

# స్వీట్ బాక్స్

**పరుగున వచ్చిన రామారావ్– "లతా! లతా...నేను మంచం కింద దాక్కుంటాను... పక్కింటి శేఖరం వస్తే... నేను ఇంకా కొంపలోకి రాలేదని చెప్పు!" అంటూ బెడ్రూంలోకి వెళ్ళి, కింద కూర్చుని బర బరా దేక్కుంటూ మంచం కిందకి దూరాడు.**

"అదేవిటండీ! అలా దేక్కుంటూ వెళ్ళి దాక్కున్నారు? అతని దగ్గర ఎప్పుడైనా అప్పూ గిప్పూ లాంటిది ఏమైనా చేశారా ఖర్మ! లేక ఏదైనా చెప్పుకోలేని తప్పు చేసి అతనికి దొరికిపోయారా?..." అంది లత కంగారుగా.

"అబ్బా! అదేం కాదు... అతను రెండు చేతులతోనూ..." అని చెప్తుండగానే గుమ్మం దగ్గర అలికిడి కావడంతో–

"అమ్మో! వచ్చేసినట్టున్నాడు!!"అని పూర్తిగా మంచం కిందకి వెళ్ళిపోయాడు.

**నవంబర్,14 డయాబెటిస్ డే సందర్భంగా!**

"ఏవిటిది!... ఎప్పుడూ లేనిది ఈయన అతనికి ఇంతలా భయడుతున్నారు?... కొంపదీసి అతని రెండు చేతుల్లో కత్తి, బరిసే లాంటివేమైనా తీసుకుని వస్తున్నాడా!?" అంటూ గుమ్మం వైపు చూసింది .

శేఖరం రెండు చేతులతోనూ,పెద్ద స్వీట్ బాక్స్‌లు పట్టుకుని లోనికి వచ్చాడు.


లతకి ఏం అర్థం కాక బుర్రగోక్కుని ఊరుకుంది.


"చెల్లెమ్మా! బావగారేరి? ఇటే వచ్చినట్టు చూసి, ఇలా వచ్చాను."

"ఇంకా లోనికి రాలేదన్నయ్యా!... ఎందుకూ?..." అడిగింది కంగారుపడుతూనే అనుమానంగా.

"నాకు ప్రమోషన్ వచ్చిందమ్మా! అందుకే మన అపార్ట్‌మెంట్‌లో ఉన్న వాళ్ళ అందరి నోళ్ళూ తీపి చేద్దామని, ఇలా కీళ్ళరిగేలా స్వీట్లు పట్టుకు తిరుగుతున్నాను." చెప్పాడు కుడి చేతిలో ఉన్న స్వీట్ బాక్స్ ముందుకు చాపుతూ...

"కంగ్రాట్స్ అన్నయ్యా! ఆయన వస్తే చెప్తాలే!" చెప్పింది లత...






స్వీట్‌బాక్స్‌లోంచి ఓ స్వీటు తీసుకుంటూ.

"సరే అయితే... పై ఫ్లోర్ వాళ్ళకి ఇచ్చేసి వస్తాలే!" అంటూ వెళ్ళిపోయాడు శేఖరం.

అతనలా వెళ్ళిపోగానే, తాబేలులా మంచం కింద నుండి తల బయట పెట్టి –

"వెళ్లిపోయాడా?" అంటూ చిన్న స్వరంతో అడిగాడు.

"ఆc!... వెళ్ళిపోయాడు. అయినా అతన్ని చూసి ఎందుకంత భయం?" అడిగింది అసహనంగా.

"అదా! అదీ...మరీ..." అంటూ నసిగి గిరుక్కున వెనక్కి తిరిగి నించున్నాడు.

"నిజం చెప్పండి. లేకపోతే మీ అమ్మ మీద ఒట్టు!" అందామె.

"అదీ మరీ... వారం క్రితం డాక్టర్ చేయించమన్న రొటీన్ టెస్టులు అన్నీ చేయించాను. అందులో నాకు షుగర్ అని తేలింది... అదీ కొంచెం ఎక్కువగా ఉందనీ, జాగ్రత్తగా ఉండాలని డాక్టర్‌గారు చెప్పారు. అందుకే అతని చేతిలో స్వీట్లు చూడగానే భయం వేసింది."

"అందుకేనా! మొన్న పక్క ఫ్లాట్ అమ్మాయి, కేక్ తీసుకొచ్చి తినమంటే, ఓ వేలు ముంచి నాకేసి చాలన్నది! ఇందుకేనా... పిజ్జాలూ, బర్గర్‌లూ మానేసి పప్పన్నం, పెరుగన్నం తింటున్నది... పైగా, పాయసం, పరమాణ్ణం, పాకుండలూ, పాలకోవా అంటూ నా ప్రాణం తీయట్లేదివిటా అనుకున్నాను. ఇదన్నమాట అసలు సంగతి. ఈరోజు వస్తుందనే ఆ రోజు నెత్తి బాదుకుని మరీ చెప్పాను... కొంచెం వ్యాయామం చేయండీ... ఓ పద్ధతిలో తినండీ అంటే విన్నారూ...ఇపుడు చూడండి ఏమైందో! అయినా తెల్లారడం భయం, ఫ్రిడ్జ్ తీసి పొద్దు పొద్దున్నే పాలకోవాలు తినేస్తారు, ఆ తర్వాత పిజ్జాలు, మధ్యాహ్నం కాగానే బిర్యానీ ఆర్డర్ చేసుకు తినేస్తారు. సాయంత్రం కాగానే స్వీట్ పూరీలూ, చాట్‌లూ తినేస్తారు. మధ్యలో కూల్ డ్రింకుల మీద కూల్‌డ్రింకులు తాగేస్తారు. ఇలా పద్ధతనే గోడని బద్దలుకొడితే, ఇలాగే అవుతుంది!!" అంటూ రాగాలు తీసింది లత.

అప్పుడే వచ్చిన శేఖరం–


"స్వీట్ తీసుకో బావా! నాకు ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది!" అంటూ తన చేతిలోని స్వీట్‌బాక్స్ అతనికి దగ్గరగా పెట్టాడు.

"లేదన్నయ్యా! ఆయనిపుడు ఒట్టిమనిషి కాదు, ఆయనకి చక్కెర వ్యాధి వచ్చింది. పైగా ఆయన మహా భయస్తుడు. వేలుకి చిన్న గాయమైతేనే, పస్ అదీ పడుతుందని, ఏకంగా సంవత్సరం పాటు పప్పులు తినడం మానేసిన మనిషి. ఇప్పుడు షుగర్ అని తెలిసాక స్వీటు ముట్టుకుంటారా?" చెప్పిందామె.

ఆ స్వీట్ల వంక కాస్త భయంగా చూస్తూ, –

"అవును! ముట్టుకోనుగాక ముట్టుకోను... అసలే షుగర్ లెవల్ ఎక్కువుందని డాక్టర్‌గారు చెప్పారు!" అంటూ గబ గబా వెళ్ళి తలుపు వెనక దాక్కున్నాడు రామారావ్.

"అయ్యో!... నువ్ భలేదానివేనమ్మా! బావ



హాస్యానందంలో
**శ్రీ గంగాధర్ వడ్లమన్నాటి**
రాసిన
**150 వ కథ ఇది!**



గారిని ఇంకా బెదరగొట్టేస్తున్నావ్. మరేం పర్లేదు. ఈ కుడి చేతిలోంది కాకుండా ఎడం చేతిలో ఉన్న స్వీట్లు తీసుకోమను. ఎందుకంటే ఇవి షుగర్ లెస్, తిన్నా ఏం కాదు... అసలు ఆ మాటకి వస్తే షుగర్ ఇపుడు పెద్ద ఇబ్బందే కాదు. టైప్ ఒన్ అయినా టూ అయినా... చక్కగా మితాహారం తీసుకుంటూ... కొంచెం వ్యాయామం, బరువు పై శ్రద్ధ, మంచి ఆహార నియమాలూ, డాక్టర్ సలహా, మెడిసిన్ క్రమం తప్పకుండా వాడితే అసలు మనకి చక్కెర వ్యాధి ఉందనే విషయమే మర్చిపోతాం తెలుసా?!... అంతవరకూ ఎందుకు, నాకూ చక్కెర వ్యాధే, కానీ ఇప్పటికీ చెక్కుచెదరకుండా చెక్క ముక్కలా చక్కగా ఉన్నాను. మా నాన్నకి కూడా చక్కెర వ్యాధి ఉంది. కానీ ఆయన ఇంకా అనాస పండులా ఆరోగ్యంగానే ఉన్నారు. ఏదైనా అంతా మనలోనే ఉంటుంది. అయినా తీపి రుచి కాదు, అదో అనుభూతి. జీవితంలో తీపి ఉండాలే కానీ, ఈ జిహ్వాకు తెలిసే తీపి నామ మాత్రమే. కనుక స్ట్రెస్ అవడం ఆపి, ఈ షుగర్లెస్స్ స్వీట్ తీసుకో!" అన్నాడు శేఖరం.

"షుగర్ లెస్ అయితే ఒకటి కాదు, రెండు తింటాను!" అంటూ తలుపు వెనుక నుండి వచ్చి, రెండు స్వీట్లు తీసుకుని లబ లాబా తినేశాడు రామారావ్.

ఇంతలో శేఖరం భార్య వచ్చి–

"ఏవండీ! కొంప ముంచారు... ఒకటి షుగర్, ఒకటి షుగర్ లెస్ స్వీట్ బాక్సూ తీసుకు రాబోయి, కంగారులో రెండూ షుగర్ మేడ్ స్వీట్ బాక్సులే తెచ్చేశారు!" చెప్పిందామె.

ఆమె ఆ మాట చెప్పీ చెప్పగానే, కోపంతో రామారావ్ కళ్ళు ఎర్రబడ్డాయ్.

అతన్నలా కోపంగా చూసిన శేఖరం, భయంతో– "బ్బా...బ్బా...బావా అదీ మరీ..." అంటూ వెనక్కెనక్కి నాలుగడుగులు వేసి, ఆ స్వీట్ బాక్సులతో అక్కడి నుండి వేగంగా వెనక్కి చూడకుండా పరిగెత్తి పారిపోయాడు.

ఇక్కడ రామారావు పరిస్థితి నేను చెప్పటం కంటే ఎవరికివారు ఊహించుకుంటేనే రక రకాల అవస్థలు అగుపడతాయి!


హాస్యానందం సౌజన్యంతో
ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం (14,నవంబర్)
సందర్భంగా



శ్రీపూటుకూరి సుబ్బారావుగారి
స్మారకంగా
రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ &
డాక్టర్స్ స్మైల్ క్లబ్, గుంటూరు వారు
నిర్వహిస్తున్న

**చక్కెర 'కేళి'**

**ఎస్.ఎమ్.ఎస్ పోటీలు**


బహుమతి పొందిన **20 మెసేజ్‌లకు**
**250 రూపాయలు చొప్పున బహుమతి+ ప్రశంసాపత్రం.**

*నిబంధనలు:*

- షుగర్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు లేదా వచ్చిన తరువాత జాగ్రత్తలు సూచిస్తూ మెసేజ్‌లు పంపించండి.
- పేషేంట్లను కించపరిచేటట్లు, భయపెట్టేటట్లు మెసేజ్‌లు ఉండకూడదు.
- ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడే మెసేజ్‌లకు మొదటి ప్రాముఖ్యత.
- మెసేజ్‌లు కచ్చితంగా నాలుగు లైన్లు దాటకుండా పంపండి.
- ఫలితాలు జనవరి,2023 సంచికలో ప్రచురించబడుతుంది.
- మెసేజ్‌లు ఈ కింది మెయిల్‌కి పంపండి–

**hasyanandampoteelu@gmail.com**

**ఎస్.ఎమ్.ఎస్‌లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2022**



కోనే నాగ వెంకట ఆంజనేయులు,
9290660220

# బుడుగు పార్టీకి వెళ్లిన కథ

సీగాన పెసూనాంబ అన్నయ్య రోహిత్‌కి బార్బీ బొమ్మ బహుమతిగా వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా ఆ బొమ్మకు మొదటి పుట్టిన రోజు పండుగ చేస్తున్నామనీ, సాయంత్రం ఆరు గంటలకు పార్టీ అనీ, తప్పకుండా రావాలని బొట్టు పెట్టి మరీ పిలిచింది రోహిత్ గర్ల్ ఫ్రెండ్ మూడో తరగతి చదువుతున్న రోషిణి.

ఆ పార్టీ కి వెళ్ళడానికి పెసూనాంబ తయారై పోయి ఆటో ఎక్కడానికి రెడీ అయి అరగంట దాటి పోయినా శ్రీమాన్ బుడుగు గారు యింకా అద్దం ముందు నుండి కదలడం లేదు.


పంచె కట్టి, లాల్చీ తొడిగి, కండువా సింగారించి అద్దంలో చూసుకుని గిరజాల జుట్టు దువ్వుకుంటూ 'నా సొగసే గని మరుడే దాసుడు కాడా' అంటూ కూని రాగం తీస్తూ మురిసిపోతున్నాడు తప్పితే అద్దం ముందు నుంచి అరంగుళం అటు గానీ, యిటు గానీ కదలడం లేదు బుడుగు.

"పార్టీకి టైమైపోతుంది త్వరగారా!" అని తొందర పెడుతున్న పెసూనాంబని "రెండు నిముషాల్లో తయారై వస్తానని గంట నుంచీ చెబుతుంటే వినిపించుకోవేం..." అంటూ ముద్దు ముద్దుగా కోప్పడు తున్నాడు కూడా.

"నువ్వెప్పుడూ యింతే! ఇంతకు ముందు ఆ బాబీగాడి పుట్టిన రోజుకి కూడా పార్టీ అయిపోయిన తరువాత వెళ్ళేం. ఎంత సిగ్గేసిందో తెలుసా!

**బాపు కార్టూన్‌కి కథ**






అంత లేటుగా వెళ్లి సమోసాలు, జీడిపప్పు పకోడీలు, కేకులు తిన్నందుకు!" కోపం ప్రదర్శించింది పెసూనాంబ.

"బాగుందమ్మోయ్! ఆ రోజేదో నా వల్ల లేటయినట్టు మాట్లాడతావేం? మీ అక్క చీర తీసుకొచ్చి కట్టుకోవడం చేతకాక రెండు గంటలు ఆ చీర కట్టుకోవడంలోనే వేస్టు చేసింది నువ్వా నేనా?" అన్నాడు బుడుగు అద్దంలో నుండి బయటికి రాకుండానే. మీసాలు కూడా వచ్చుంటే ఎంత బావుండేదో కదా అని ఫీలవుతూ.


"ఆ రోజు నువ్వే కదా – పొట్టి లంగా, పొట్టి జాకెట్టు వద్దు. చీరలో అయితే సమంత అంత అందంగా వుంటావని రెచ్చ గొట్టింది!" మళ్లీ రెచ్చిపోయింది పెసూనాంబ.

"అవును అన్నాను తప్పా! చీరలో నువ్వెంత బావుంటావో నీకు తెలియదు. చూడు – ఇవాళ కూడా ఎంత అందంగా ఉన్నావో ఈ చీరలో చిరుకోపంలో కూడా!"

"చాల్లే సంబండం! త్వరగా కానీ. అవతల ఆటోవాడు హారన్ మోగిస్తూ గోల గోల చేస్తున్నాడు!" కోపంలో ముసి ముసి నవ్వు మిళాయించి అంది పెసూనాంబ.

"ఇదిగో వచ్చేస్తున్నా! ఈ లోగా నా షోలాపూర్ చెప్పులు తీసి బయట పెట్టు... ఈ డ్రెస్ మీదికి అవే బావుంటాయ్!"

"నీ షోలాపూర్ చెప్పులా?... ఇంకెక్కడ ఉన్నాయ్ అవి! మొన్న పండుగాడి యింట్లో పెళ్లికి వెళ్ళినప్పుడు పోయాయి కదా!... చెప్పుల్లేకుండా యింటికి నడిచి వచ్చి పాదాల్లో రాళ్లు గుచ్చుకుని నొప్పి పెడుతున్నాయని... గొడవ గొడవ చేసి నాచేత గంటసేపు పాదాలు నొక్కించుకున్నావు కదా!... మర్చి పోయావా?" నిలదీసింది పెసూనాంబ.





"అంటే ఏమిటి నువ్వనేది? నాకు సేవలు చెయ్యలేక అలిసి పోతున్నావనేగా? నీకు బాగా లేనప్పుడు నేను నీకు సేవలు చెయ్యడం లేదా?" ఉడుక్కున్నాడు బుడుగు.

"ఓయబ్బా! ఏం చేసి పడిపోతున్నారు తమరు? మొన్నటికి మొన్న... దొంగాటలో రాయి తన్నుకుని కింద పడిపోయి మోకాలు చెక్కుకు పోయి నేను ఏడుస్తుంటే – నీ దారిన నువ్వు ఆ రెండు జెళ్ల సీతతో ఆడుకుంటూ వుండి పోయావు గానీ నా వంక కనీసం తొంగి చూశావా?... నన్నసలు లెక్కే చెయ్య లేదు నువ్వు!" నిలదీసింది పెసూనాంబ.

"నేను బళ్లోనే లెక్కలు చెయ్యను కదా!... నిన్నెలా లెక్క చేస్తాననుకున్నావ్? అయినా నేనెందుకు చెయ్యాలి నీకసలు సేవలు?... ఉన్నాడుగా నీ బాయ్ ఫ్రెండ్ ఆ పిడుగు గాడు. వాడు చేశాడుగా నీకు చెయ్యాల్సిన సేవలన్నీ. ఆ రోజు వాడు నీ దెబ్బ మీద ఉమ్ము రాసి... మట్టి జల్లి వైద్యం చెయ్యడం నేను చూడలేదనుకున్నావా?" ఉక్రోషం పెల్లుబికిస్తూ అన్నాడు బుడుగు.

"ఆc! చూసే ఉంటావులే. నాతో ఎవరెవరు స్నేహంగా ఉంటున్నారో అని దొంగ చూపులతో గమనించడమేగా నీ పని!..." ఎత్తి పొడిచింది పెసూనాంబ.




"ఆ... ఇంతోటి అందగత్తె నాకు ఇంకెవత్తీ దొరకదని నీ వెంట పడ్డాను మరి!"

"కాక మరేమిటీ!... అందుకే కదా మా అన్నయ్య యింట్లో పార్టీకి నాతోనే వస్తానని ఏడుపుముఖం పెట్టుకుని మరీ బతిమిలాడేవు!"

"ఎవరు నేనా? ఏడుపు ముఖంతోనా?... నా ముద్దొచ్చే ముఖం చూసే అంటున్నావా ఈ మాట?"

"ముద్దొస్తే ముద్దు పెట్టుకో! ఎవరొద్దన్నారు నిన్ను?"

"నన్ను నేను ఎలా ముద్దు పెట్టుకోగలను? నా బుగ్గ నాకు అందదుగా!"


"అందకపోతే బల్ల ఎక్కి అందుకుని ముద్దు పెట్టుకోరా పొట్టోడా!" కవ్వించింది పెసూనాంబ.

"వాణిశ్రీ కొప్పు వేసుకున్నంత మాత్రాన నువ్వు నా కంటే పొడుగని మురిసిపోకు!"

"అబ్బా! దిగివచ్చాడండీ పెద్ద అమితాబ్ బచ్చన్!"

"వేళాకోళం చాలించి... యింటి తాళాలు ఎక్కడున్నాయో చూడు! బయలు దేరుదాం!"

"మహానుభావా! తాళం కప్పా, చేవితో నేను ఎప్పుడో తయారుగా ఉన్నాను... తమరిదే ఆలస్యం!"




"పద పద త్వరగా! ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయిందనుకుంటా! ఇదిగో ఆటోబాబూ! అదేమిటీ? నువ్వెవరు? మా ఆటో అతనేడీ?"

"నేనే కదండీ మీ ఆటో వాడిని. నన్నే కదా తీసుకు వచ్చారు మీరు ఆటోస్టాండ్ నుంచి?" ప్రశ్నించాడు ఆటో అంకుల్.

"నేను తీసుకు వచ్చింది నిన్ను కాదే. నేను పిలుచుకొచ్చిన ఆటో అతనికి గడ్డం లేదు. నీకు ఉంది మరి?..." చెప్మా ముఖం పెట్టేడు బుడుగు.

"అబ్బాబ్బా!... ఇప్పటికే టైమ్ అయిపో యింది. ఇంక ఆ ఆటోవాడితో వాదన మాని బయలుదేరేది ఉందా లేదా?" పెసూనాంబ గోల పెట్టింది.

"సరే పద!" రాజీకి వచ్చాడు బుడుగు.

✦✦✦

"రండి రండి బావ గారూ!... ఏమిటిలా సడెన్‌గా దిగబడ్డారు?" రోహిత్ ముఖం చిట్లిస్తూ ఆహ్వానించాడు.

"ఇది మరీ బావుందండోయ్! ఈ రోజు మా బొమ్మ పుట్టిన రోజు పార్టీ ఉంది రమ్మని నీ గర్ల్ ఫ్రెండ్ రోషిణితో బొట్టు పెట్టించి మరీ పిలిచి యిప్పుడు ఎందుకు వచ్చారని అడుగు తున్నావు! నువ్వేమి పెద్దమనిషివయ్యా?"

"మా బార్బీ బొమ్మ పుట్టిన్రోజు పార్టీయా? అది ఎప్పుడనగా అయిపోయింది?..."

ఆశ్చర్యాన్ని ప్రకటించాడు రోహిత్.

"అయిపోయిందా? అయితే మేము లేటుగా వచ్చామా?..." క్వశ్చన్‌మార్కు ముఖంతో అడిగేడు బుడుగు.

"మీ ఇంట్లో గడియారం లేదా?" అడిగేడు రోహిత్.

"ఎందుకు లేదు? ఉంది. కానీ దానిలో ముళ్ళు లేవు. అందుకే కదా లేటయిపోయాం!" సంజాయిషీ యిచ్చాడు బుడుగు.

"గడియారంలో ముళ్ళు లేవా?... ఎందుకు లేవు?"

"మీ చెల్లి మెడలో మూడు ముళ్ళు వేసిన తరువాత ఇంక గడియారంలో ఎందుకని ఆ మూడుముళ్లు తీసేశాం!"

"నేనే తీసేశానన్నయ్యా! ఈ మనిషితో వేగ లేక... నా మెడలో ఈయన వేసిన మూడు ముళ్ళు ఎలాగూ తీసేయలేను కదా... అందుకని గడియారంలోని మూడుముళ్లు నేనే తీసేశాను!" చెప్పింది పెసూనాంబ.

"గడియారంలో ముళ్ళు లేవు సరే... మీ యింట్లో కేలండర్ కూడా లేదా?" రోహిత్ అడిగేడు.

"ఎందుకు లేదు. పక్క గదిలో ఉందిగా!" చెప్పేడు బుడుగు.

"అయితే కనీసం కేలండర్ అయినా చూసి ఉండాల్సింది. పార్టీ ఎప్పుడో అయిపోయింది. మీరు మూడు రోజులు లేటుగా వచ్చారు!"

"అవునా! పార్టీ మూడు రోజుల క్రితమే అయిపో యిందా? అందుకేనా వెయిట్ చేసీ చేసీ ఆ ఆటో వాడికి గడ్డం పెరిగిపోయింది?" ఆశ్చర్యాన్ని ప్రకటిం చాడు బుడుగు.

"నేను అప్పుడే అనుకున్నాను అన్నయ్యా! ఈయన గారి సోకుకి గంటలు కాదు కదా రోజులు కూడా సరిపోవని!" నిష్ఠూరించింది పెసూనాంబ.

"ఇప్పుడు నా సోకు గురించిన వివరాలు అంత అవసరమా?" సిగ్గు పడకుండా అన్నాడు బుడుగు.

"చేసిన నిర్వాకం చాలు గానీ... యిక పద యింటికి!" రుస రుస లాడింది పెసూనాంబ.


"మరి పార్టీనో?" అయోమయంగా అడిగేడు బుడుగు.

"నేను... నేను చేస్తాగా పార్టీ యింటికి వెళ్లిన తరువాత! పద ముందు!!" యింటికి వెళ్లేకా ఏం చెయ్యాలో నిర్ణయించుకుంటూ దెబ్బతిన్న పిల్లిలా అనుసరించాడు బుడుగు.

# బాలి కార్టూన్‌కి క్యాప్షన్

## అక్టోబర్ నెల క్యాప్షన్ ఫలితాలు


**బహుమతి పొందిన క్యాప్షన్**




**-టి.ఆర్‌బాబు**

## మరికొన్ని క్యాప్షన్లు

- ✦ హుష్! మావిడ ఫ్రెండ్ తను"..... **-యం.సిహెచ్ పూర్ణ చంద్రరావు**
- ✦ పక్కింటావిడ కాదు గురు ఈ ఇంటావిడే **-కందర్ప మూర్తి**
- ✦ అన్నట్లు గుర్తు వచ్చింది. ఈ నెలలో హిమాలయాస్ వెళ్తున్నాము **-పెండేల**
- ✦ చింత చచ్చినా పులుసు చచ్చినట్టు లేదే... ఈ వయసులో! **-జనార్దన్ అంబల**
- ✦ ఏవండోయ్ .. నేను సినిమాకు వెళ్ళొస్తా... వచ్చేసరికి సింక్‌లో గిన్నెలన్నీ తోమేసి సర్దేయ్యండి..! **-రామకృష్ణ**
- ✦ ప్రత్యక్షంగా, పరోక్షంగా మన భావాలన్నీ ఒకటేనోయ్ **-కె. ద్వారకనాథ్**





ప్రఖ్యాత చిత్రకారులు, కార్టూనిస్టు శ్రీ బాలిగారు గీసిన ఒక బొమ్మ ఇక్కడ ఇస్తున్నాం.
ఈ బొమ్మకి తగ్గట్టు... నవ్వొచ్చేట్లు క్యాప్షన్ రాసి పంపండి. ఉత్తమ క్యాప్షన్‌కి బాలిగారి కార్టూన్ పుస్తకం బహుమతి! బాగుండే కొన్ని క్యాప్షన్లు ప్రచురిస్తాం.


**నిబంధన:** ఒక డైలాగ్ మాత్రమే ఉండాలి. నవ్వు వచ్చే విధంగా రాయాలన్నది ముఖ్య గమనిక!


మీ క్యాప్షన్‌లు చేరవలసిన ఆఖరి తేదీ: **నవంబర్,20.**


ఈ మెయిల్‌కు మీ క్యాప్షన్ పంపండి-
**hasyanandam.mag@gmail.com**.



ఫేస్బుక్ ఫ్యాన్స్
SARMA


ఏంటయ్యా ఇదీ!? ఫైల్లో నోట్ పుటప్ చేసి, దానికింద మీ లైక్‌లు, కామెంట్లతో బాస్‌కి షేర్ చేయండని రాసావ్! ఫేస్‌బుక్ పైత్యం బాగా ముదిరినట్లుందే!
SARMA


బావ ఇంకా ఇంటికి రాలేదనీ, ఫోన్ చేస్తే రెస్పాన్స్ లేదనీ.. అలా దిగులుగా కూర్చుంటే ఎలా అక్కా!? ఫేస్‌బుక్ చూడాల్సింది! ఐనాక్స్‌లో ఉన్నట్టు స్టేటస్ అప్‌డేట్ పెట్టాడు!!...
SARMA


ఈ FB ఫ్రెండ్స్ చూసావా!? నెల్రోజులై నేను FBకి దూరంగా ఉన్నా.. ఒక్కడూ 'నీకేమైంది? ఎందుకు FB లోకి రావడం లేదని'- అడగలేదు!
SARMA


ఆ ముక్కూ మొహం తెలీని వాడితో చాటింగేంటే!?
అబ్బా!! ఫేస్ బుక్‌లో అవేం ఉండవు మమ్మీ!!
facebook
SARMA


మీ ప్రైవేట్ షూటౌట్‌లోని పిచ్చిఫోజుల ఫోటోలన్నీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసారు! అవి జనాలు బాగా షేర్ చేసుకుంటూ మిమ్మల్ని ఓ ఆట ఆడుకుంటున్నారు!
SARMA

బాచి కార్టూన్‌కి కథ

# భిన్న ధ్రువాలు

డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం
8790243849

**కా**మేశం, కామాక్షి 25 ఏళ్ల క్రితమే భార్య భర్తలై ముగ్గురు పిల్లలకు తల్లిదండ్రులు అయ్యారు! చదువు సంధ్యలు అయిపోయాక ముగ్గురు అబ్బాయిలు చెట్టు మీద పక్షులు ఎగిరిపోయినట్టుగా, ఉద్యోగాల కోసం ఎటు వాళ్లు అటు వెళ్లిపోయారు!

గత 25 ఏళ్ల నుండి కూడా ఏ విషయం మీద కూడా ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరటం లేదు ఎడ్డం అంటే తెడ్డమనే రకాలు!!

ఇంట్లో ప్రతిరోజు ఎవరికి ఇష్టమైన కూర వారికి వండాల్సిందే!!

కామేశం పనిచేసి రిటైర్ అయ్యారు! ఇల్లు ఆఫీసు తప్ప మరో మాట లేదు అతనికి! ఆ విషయంలోనే కామేశానికి కామాక్షమ్మకు గొడవ! ఏ ఒక్క పని సాగకుండా గొడవ పెట్టు కుంటాడని భయం ఆమెకు!

ముందు హాల్లో కూర్చుని పేపర్ చదువు కుంటూనే కూరలో ఉప్పు తక్కువ అయింది, కారం తక్కువైంది, పాలు పొంగిపోతున్నాయి, అన్నం మాడిపోతుంది" అంటూనే...ఇల్లు ఊడ్చనివ్వడు! కడగనివ్వడు! పేపర్ చదువు కునేటప్పుడు... టీవీ చూసేప్పుడు...అటు ఇటు జరగాలని అతని బాధ! అందుకే ఆమెను వద్దంటూ ఉంటాడు!

భర్త తన వంటింటి పనులకు ఇంటి పనులకు అడ్డం రాకుండా కాసేపు అలా బయటకు వెళ్తే బాగుండు అనుకుంటుంది కామాక్షి!

"ఉద్యోగం ఉన్నప్పుడెలాగూ బయట తిరగక తప్పలేదు! ఇప్పుడైనా కాస్త ఆరాంగా ఇంట్లో కూర్చోవచ్చుగా!... అనవసరంగా బయట ఎండలో తిరిగే బదులు!" ఇది కామేశం మనసు వృథా రొద!

వంటింట్లో ఉస్సురో మనుకుంటూ నుదుటి నుదుట పట్టిన చెమటలు తుడుచుకుంటూ పని చేసుకుంటున్న కామాక్షిని "ఏమే ఇలా రా!" అంటూ కేకేశాడు!

"ఏంటో చెప్పి తగలడండి! నాకు చేతులు ఖాళీగా లేవు!... రాలేను గట్టిగా చెప్పండి!" వంటింట్లో నుండి కామాక్షి గావు కేకలు!

వీడు పిలిస్తే నేనెందుకు రావాలనేగా నీ బాధ అంటూ గొణిగాడు కామేశం!!

"అబ్బబ్బ అన్నిటికీ గొడవే!! ఇన్నేళ్లు వచ్చినా నన్ను వేధించే బుద్ధి మారదుగా! పొయ్యి కట్టేసి వస్తున్నానుండండి!..." అంటూ హాల్లోకి వెళ్ళింది– "ఇంతకీ ఏం కావాలి?? అంది కామాక్షమ్మ కోపంగా!

"కాస్త ట పెట్టివ్వవే! అందుకే పిలిచాను!" అన్నాడు నెమ్మదిగా!


"మీకు నాతో ఏమైనా పనున్నప్పుడే నంగ నాచి పిల్లిలా బిక్కు బిక్కు మని అడుక్కుం టారు! లేకుంటే పులిలా మీద పడతారు నాకు తెలీదా మీ భాగోతం! పాతికేళ్ల నుండి నుండి చూస్తూ అనుభవిస్తున్నానుగా!" బుంగమూతి తిప్పుకుంటూ కామాక్షి వంటింట్లోకి వెళ్ళింది కాఫీ కోసం!

మొత్తం పని అంతా అయ్యాక కామక్షమ్మ కాస్త నడుం వాల్చి నిద్రపోతుంది!

కామేశ్వరరావుకు ఆ టీవీయే లోకం! కామా క్షమ్మకు ఆ వంటిల్లు లోకం!

కామాక్షమ్మ నిద్ర లేచి, భర్తకు టీవీ చూస్తున్న పుడు తాను ఏం చెప్పినా అర్థం కాదని, కూర గాయలు తెచ్చుకుందామని మార్కెట్‌కి వెళ్లి కావలసిన కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చింది!

కామాక్షమ్మను చూసి కామేశం– "నీకెన్ని సార్లు చెప్పాను, నా హెల్మెట్ కూరగాయలకు తీసుకపోవద్దని! సంచి కూడా కొన్నాను కదా! ఏం పోయే కాలం వచ్చిందే నీకు నీ పుణ్యమా




అని, నా హెల్మెట్‌కు అన్ని చొట్టలే! నీ తద్దినం పెట్టా!" అంటూ తిట్ల పురాణం అందు కున్నాడు!

అంతలోనే కామాక్షమ్మ– "మరేం లేదండి! సంచి తీసుకెళ్తే టమోటాలు వంటి మెత్తని కూరగాయలు పగిలిపోతున్నాయండీ!... అదే హెల్మెట్‌లో అయితే ప్లేస్ వెడల్పుగా ఉండి విడివిడిగా ఉంటాయి, గనుక పగలకుండా ఇంటికి వస్తాయి! తొందరగా మురిగిపోవు కూడాను!...అర్థం చేసుకోరు!" అంది గోముగా కామాక్షమ్మ!

అంత గొప్ప కామాక్షమ్మ అంటే కామేశ్వర రావుకు మాత్రము మళ్లీ నోరు ఎలా లేస్తుంది? అంతా సైలెంట్! అదేగా భిన్న ధ్రువాల మధ్య ప్రేమ! అదంతే!!

ఎన్.బి.యస్.శ్రీనివాస్ పోలిశెట్టి
9989646639

# కాశీయాత్ర

**కాశీయాత్ర ముగించుకుని అప్పుడే ట్రైన్ దిగారు సుందరి సుబ్బారావు.**

**"ఏవండోయ్! ఈ లగేజ్ మోయడం నా వల్ల కాదు కనీసం ఇక్కడైనా ఆటో పిలవండి!" అంది సుందరి.**

**"ఎందుకోయ్! నాలుగు అడుగులు వేస్తే ఇల్లు వచ్చేస్తుంది... ఆ మాత్రం దానికి వంద రూపాయలు దండగ!" అన్నాడు సుబ్బారావు.**

"మీ పిసినారితనం ఇకనైనా కట్టిపెట్టండి... అసలు కాశీలో మీకు ఇష్టమైన ఈ పిసినారితనం వదిలిపెట్టాల్సింది... ప్రాణం హాయిగా ఉండేది!" విసుక్కుంది సుందరి.

సుందరికి మేకప్ అంటే మహాపిచ్చి. ఈ విషయంలో ఏ మాత్రం తగ్గదు. అక్కడ ఇక్కడ పోపుల డబ్బాలో దాచిపెట్టిన డబ్బులు పెట్టి మేకప్ సామాన్లు కొనుక్కుంటుంది. లిప్స్‌కి లిప్‌స్టిక్ పడందే బయటకు రాదు. ఎప్పుడూ హ్యాండ్‌బ్యాగ్‌లో చిన్నపాటి అద్దం మెయింటైన్ చేస్తుంది. నేను అందంగా ఉన్నానా? అని సుబ్బారావుని అడిగితే... ఆఁ!.... మందంగానే ఉన్నావు అంటాడని ఎప్పుడు అడగదు.

అసలే చాలాకాలం తర్వాత కాశీయాత్రకు ఓకే చెప్పాడు సుబ్బారావు. వెళ్ళేది ఉత్తరాదియాత్ర ఉత్తరాదిలో మేకప్ పడకుండా స్త్రీలు ఎవరు కనిపించరన్నది హిందీ సినిమాలు చూసిన సుందరికి నమ్మకం. అందుకే అన్ని సామాన్లతో పాటు తన మేకప్ కిట్ ను కూడా బ్యాగులో సర్దేసింది.

తీరాచూస్తే సుబ్బారావు యిక్కడ ట్రైన్ ఎక్కింది మొదలు మళ్లీ దిగేంత వరకు మేకప్ కిట్ ముట్టుకునే టైం కూడా సుందరికి ఇవ్వలేదు.

కాశీ వెళ్లినా మేకప్ మెయింటెన్ చేయలేకపోయానన్న బాధ సుందరిలో మిగిలిపోయింది.


అందుకే సుబ్బారావుపై ఎగిరెగిరి పడుతుంది.

దానికి సుబ్బారావు– "అవునుమరి! నాదే పిసినారితనం నిన్ను నాకు కట్టపెట్టినప్పుడు మీ నాన్న ఎంత గీచి గీచి బేరమాడాడో నీకు ఎన్నిసార్లు చెప్పలేదు... అక్కడికి ఆయనేదో భోళాశంకరుడు అన్నట్లు చెబుతావు... అయినా నాది పిసినారితనం అనుకోవడం దేనికి పొదుపు అనుకోవచ్చు కదా!" కస్సుమన్నాడు సుబ్బారావు.

"పిసినారితనానికి పొదుపుకి... నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది! ఇప్పుడు మారతారు... అప్పుడు మారతారు... అనుకుంటూనే జీవితమంతా గడిచిపోయింది. జీవితంలో ఒక్కసారైనా కాశీయాత్ర చేయాలని పెద్దలు చెప్పారు కాబట్టి ఇంతకాలం అక్కడ ఇక్కడ దాచి పెట్టిన సొమ్ము మీ చేతికి ఇచ్చాను. దానిలోనూ పిసినారితనం చూపించి ఎండలు ఇంత మండిపోతున్నా... నాన్ ఎ.సి ట్రైన్‌లో కాశీ తీసుకు వెళ్లారు... ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది?!" కోపంగా అంది సుందరి.

"కాశీ వెళ్లడానికి ఏసీ ట్రైన్ ఏం కర్మ! ఏకంగా ఫ్లైట్‌లో ఎగరవచ్చు... అయినా కాకపోయినా తీర్థయాత్రలు అనేవి ప్రశాంతంగా చేసేవి. పదిమందితో కలిసి చేసేవి... పనిగట్టుకుని నడిచి చేసేవి... ఫెసిలిటీస్ వచ్చాయి కదాని ఎలా పడితే అలా వెళ్ళకూడదు!" అనేసరికి...

"అవునవును! వెనకటికి ఎవడో ఏదో నాది కాదంటే కాశీ దాకా దేకమన్నాడంట!" అంటూ సామెత చెప్పింది సుందరి.




"అంటే...ఏంటే?! నాకు చేతకాక ఇలా తీసు కెళ్ళానంటావా?..." కాస్త కంఠం సవరించి అడి గాడు సుబ్బారావు

"ప్రతిదానికి ఏదో ఒకటి చెప్పడం మీకు పరి పాటే కదా! చెప్పండి... ఎందుకు ఇలా తీసుకు వెళ్ళారో... అది కూడా చెప్పండి!" మూతిబిగించి అందామె.

"ఏముంది?! మనం ఏసీలో వెళ్లి ఉంటే... ఎవరికివారే యమునాతీరే! అన్నట్లు ఉండే వాళ్ళం. సెకండ్ క్లాస్‌లో వెళ్ళాం కనుక పది మందితో కలసి మాట్లాడుకుంటూ వెళ్ళాం. పైగా పదిమంది పెట్టినవి కూడా హాయిగా తిన్నాం... ఇదంతా కలసి వచ్చినట్లే కదా!" మరోసారి పిసి నారితనాన్ని బయటపెట్టాడు సుబ్బారావు.

"బావుంది మీ వరస! వాళ్ళు వీళ్ళు పెట్టినవి మరపట్టించినట్లు ఓ... ఆడించేసారు.. కానీ ఆ తర్వాత వాళ్లు ఏమనుకుంటారో ఆలోచించారా?!" నిందిస్తున్నట్లు పలికింది సుందరి.

"చూడు భార్యామణి! మన వెనుక వంద మంది వంద రకాలుగా అనుకుంటారు...అలా ఆలోచిస్తే ఈ మాత్రం డబ్బులు మిగిలేవా?" ఏమాత్రం మొహమాటపడకుండా చెప్పాడు సుబ్బారావు.

"నా మటుకు నేను చెప్పడమే గాని మీరు ఎప్పుడైనా అంగీకరించారా?! పైగా నాకూ అలవాటు చేసేసారు!" సుందరి అంది.

"ఇది మరీ బాగుంది! ఈ లక్షణం మీ నాన్నలో ఉందని ఇందాకే చెప్పాను కదా నన్నెందుకు ఆడిపోసుకుంటావు. జీన్స్ ద్వారా నీకు వచ్చిందేమో!" చేతిలో లగేజిని సవరించుకుంటూ అన్నాడు సుబ్బారావు.

"పుణ్యక్షేత్రం అంతా తరచి తరచి చూడాలని చెబుతూ కాశీ మొత్తం నడిపించేశారు... కాళ్ళు దిబ్బరొట్టెల్లా తయారయ్యాయి...ముఖం పీక్కుపోయింది. పెదాలు పొడిబారి పోయాయి. నిగనిగలాడే నాజుట్టు ఎండి పోయిన చీపురు కట్టలా తయారయింది... మేకప్ లేక ఎలా ఉన్నానో చూడండి! అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని ఉందన్నట్లు మేకప్ కిట్ బ్యాగులో ఉన్నా ఏం లాభం? క్షణం తీరిక లేకుండా తిప్పేశారు... కనీసం ఇక్కడైనా ఆటో కట్టిస్తారంటే ససేమిరా అంటున్నారు. ఇప్పుడు చూడండి నా ఒళ్ళు బ్యాలెన్స్ తప్పిన కావెడలా ఊగుతుంది... ఎవరైనా నా అవతారం చూస్తే సుందరేనా? ఇలా ఉంది అని నవ్వుకుంటారు!" నడవలేక నడవలేక నడుస్తూ ఆయాసంతో అంది సుందరి.

"ఎందుకే చెవి కోసిన మేకలా దారి పొడవునా నన్ను ఆడిపోసుకుంటావు... నడక ఆరోగ్యానికి మంచిది. అందుకే మన వీధిలో ఉన్న ఆడాళ్ళంతా ఇంట్లో ఏ పని చేసినా చేయకపోయినా ఉదయాన్నే లేచి మార్నింగ్ వాక్ మాత్రం మహాస్టైల్ గా చేస్తారు... అది నువ్వు తీర్థయాత్ర



పేరుతో చేస్తున్నావ్... వాళ్ళ కంటే నువ్వే బెటర్! పుణ్యం, ఫలం రెండూ లభిస్తాయి!" లాజికల్‌గా మాట్లాడాడు సుబ్బారావు.

ఏదో ఒకటి లెండి అనేటప్పటికి ఎదురుగా ఇల్లు కనిపించింది.

"హమ్మయ్య! కొంపకు చేరాం!...వారం రోజుల క్రితం విడిచిపెట్టిన ఈ కొంపను చూస్తే ప్రాణం లేచొస్తుంది..." అని తాళంకప్ప ఓపెన్ చేసి గబుక్కున గదిలో కూలబడింది సుందరి.

✦ ✦ ✦


రెండు రోజులపాటు ఏకబిగిన పాదాలకు నూనె పెట్టి మసాజ్ చేసుకుంటూనే ఉంది... తరిగిపోయిన అందానికి మేకప్పులు దిద్దే పనిలో చాలా బిజీగా ఉంది సుందరి.

సుబ్బారావు మాత్రం అరుగు మీద ఉన్న మడత కుర్చీలో పడుకొని రెండు కాళ్లను ఎండలో ఆరబెట్టుకుంటున్నాడు...

"బావా!... ఎప్పుడు వచ్చారు? కాశీయాత్ర ఎలా జరిగింది?" కుశల ప్రశ్నలు వేస్తూ ఎంట రయ్యాడు జగన్నాథం.

"కాశీయాత్ర మాట ఏమోగానీ మీ అక్క దారిపొడవునా సతాయిస్తూనే ఉంది. ఊరిలోకి దిగిన వెంటనే... ఆటో కట్టించలేదని, ఏసీ ట్రైన్‌లో కాశీ తీసుకు వెళ్లలేదని ఒకటే గోల!..." కంప్లయింట్ చెప్పాడు సుబ్బారావు.

"ఏంటక్కా! బావ నీ మీద ఏదో నిందలు వేస్తున్నాడు నిజమా?!" అన్నాడు జగన్నాథం.




"ఏముంది తమ్ముడు! మీ బావకు నా మీద నిందలు వేయడం తప్ప వేరే పనేముంది? పెళ్లయిన తర్వాత మేము చేసిన అతిపెద్ద యాత్ర ఇదే! కాశీ వెళ్ళినా... మీ బావ కక్కుర్తి పోలేదు!" ఖరాఖండిగా చెప్పేసింది సుందరి.

ఆ మాట విన్న సుబ్బారావు– "విన్నావట య్యా జగన్నాథం! అదీ మీ అక్క వరస... అవి ఇవి వదిలి పెట్టడం కంటే కాశీలో మీ అక్కను వదిలిపెట్టి ఉంటే బాగుండేది!" చిరు కోపంతో అన్నాడు సుబ్బారావు.

"ఆఁ! నాకు తెలుసు మీ ప్లాన్!...మళ్లీ పెళ్లి చేసుకుంటే ఎంతో కొంత రాకపోతుందా!..." కస్సుమంది సుందరి.

"అమ్మా! సుందరి!... బావ ఏదో మాట వరసకు అన్నాడు... నిన్ను విడిచి ఒక్క క్షణం ఏనాడైనా ఉన్నాడా?" జగన్నాథం అనేసరికి...

"ఎందుకు ఉంటారు? ఈయన గారితో ఎవరు వేగగలరు నేను తప్ప!..." తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకుంది సుందరి.

"అదిసరే గానీ... ఇంతకీ కాశీలో ఇద్దరూ ఏమి విడిచి పెట్టారు?" ఆసక్తిగా అడిగాడు జగన్నాథం.

"ఏముంది బావ నాకు బాగా ఇష్టమైన ఈత కాయ... రామఫలం!" అన్నాడు.


"అదేంటి బావా! ఆ రెండు మన ఊర్లో దొరకవు కదా! వాటిని వదిలిపెట్టావ్ ఏంటి?!" అడిగాడు జగన్నాథం.

"అరుదుగా దొరికేవి అవే! పైగా సీజన్లో రేటు కూడా ఎక్కువ ఉంటుంది... అవి నాకు కొంత ఇష్టం కూడా!...ఏదో నోరు సచ్చి తిందా మని అడిగితే... అమ్మే వెధవ ఆస్తులు రాసి మ్మంటాడు... అందుకే చీపుగా దొరికే కాయ లను పళ్ళను వదులుకోవడం కంటే వీటిని వదులుకోవడం బెటరని వదిలేసా!" నిజం చెప్పాడు సుబ్బారావు.

"అక్కా! నువ్వేమి వదిలేసావు?" అడిగాడు జగన్నాథం.

"ఏముంది తమ్ముడు తినాలని ఉన్నా ఈ షుగర్ జబ్బు వల్ల తినలేని తాటికాయ, సీతా ఫలం వదిలేసా! పైగా జిహ్వా చాపల్యం చావక తింటే షుగర్ మీటర్ రీడింగ్ తారాజువ్వలా పరిగెడుతుంది.. అందుకే వదిలేసాను!" హెల్త్





కాన్షియస్‌లో చెప్పింది సుందరి.

ఆ మాటలకు జగన్నాథం కళ్ళు బైర్లు కమ్మాయి. "ఐతే మీరిద్దరూ కాశీ వెళ్ళి ఒకరు కొనలేనివి మరొకరికి తినలేనివి వదిలేసి వచ్చారన్న మాట!" అన్నాడు జగన్నాథం.

"లేకపోతే ఏమి వదిలిపెట్టమంటావురా తమ్ముడు?... నా మేకప్‌నా?!... మీ బావ ఫలాపేక్షనా?" అంది యధాలాపంగా సుందరి.

"కరెక్ట్‌గా చెప్పావే అక్క! మనం కాశీ వెళ్లి వదిలిపెట్టాల్సినవి కాయ...ఫలం... కాదు!" అన్నాడు జగన్నాథం.

"కాయ,ఫలం కాకుండా ఏమి వదిలిపెట్టాలంట?!... కావాలంటే ఎవరినైనా అడుగు అందరూ కూడా వారికి ఇష్టమైన ఒక కాయ, ఒకఫలం వదిలిపెట్టి వచ్చేస్తుంటారు...అంతెందుకు మొన్నటికి మొన్న పంకజాక్షి కాశీ వెళ్లి కూరగాయలలో రాజైన వంకాయను... ఫలాలలో రాజాఫలం మామిడిపండును... వదిలేసి వచ్చింది!" గొప్పగా చెప్పింది సుందరి.

"అయ్యో అక్కా! కాశీలో వదిలిపెట్టాల్సింది కాయాపేక్ష...ఫలాపేక్షలు!... కాయలు, పళ్ళు కాదు!" అరచినట్టు చెప్పాడు జగన్నాథం.

"కాయము అనగా శరీరం... అంటే శరీరం మీద వుండే ఆపేక్ష అంటే... ఇష్టమును విడిచిపెట్టాలి... అంతేకాకుండా ఫలాపేక్ష అనగా మనము ఎవరికైనా సాయం చేసినప్పుడు... ఫలము అంటే ఫలితం ఆశించకపోవడం విడిచిపెట్టాలి... అంతేగాని ఒక కాయ ఒక ఫలమును విడిచిపెట్టడం కాదు!" అసలు రహస్యం విడమర్చి చెప్పాడు జగన్నాథం.

జగన్నాథం చెప్పింది విన్నాక ...


"ఈ విషయం ముందే చెప్పి ఉంటే... కాశీయాత్ర డబ్బులు మిగిలి ఉండేవి కదరా తమ్ముడు!" అంది సుందరి.

అక్క అంతర్యం తెలియక నోరెళ్లబెట్టాడు జగన్నాథం.

"మరేమీ లేదు తమ్ముడు! మీ బావకు ఫలాపేక్ష ఎక్కువ! అది లేనిది ఏ పని చేయరు... ఇక నాకంటావా... నా పేరులోనే ఉంది సుందరి... అర్ధగంటకొకసారి మేకప్ వేయకుండా ఉండలేను...కనీసం టచ్‌అప్ అయినా ఉండాలి... అలాంటిది నా కాయాపేక్ష... ఈ రెండింటిని కాశీలో వదిలేయడమా?! ఇంకేమైనా ఉందా?! నలుగురిలో హుందాగా బతకాలంటే శరీరానికి అందము... చేసినదానికి ఫలితము ఆశించక తప్పదు!" తేల్చి చెప్పేసింది సుందరి.

"అంతే!... అంతే!!... అందుకే అందరూ ఇప్పుడు కాయాపేక్షలో 'కాయ'ను... ఫలాపేక్షలో 'ఫలము'ను తీసుకుని కాశీ వెళ్లి గొప్పగా వదిలిపెట్టేస్తున్నారు!..." అని...

'చేసిన పనిని సమర్ధించుకునే వీళ్ళకు మంచి బుద్ధులు ప్రసాదించమని' మనసులో అనుకుంటూ దేవుణ్ణి మొరపెట్టుకున్నాడు జగన్నాథం!








ప్రముఖ కార్టూనిస్ట్ **భగవాన్**
**ఫన్ ప్రశ్నలకు-**
ప్రముఖ హాస్య నటులు **సుదర్శనమ్**
**పంచ్ సమాధానాలు**

*Cartoons: Sangram*



✦ పెళ్ళయిన మగాళ్ళు ఇంట్లో కాస్త ప్రశాంతంగా ఉండడానికేవన్నా వ్రతముంటే చెప్తారా?
**రోజంతా 'కిళ్ళీ' నవిలే అలవాటు చేస్కోండి... వాగాలని ఉన్నా వాక్కుండా పడి ఉండే నేర్పు అలవాటు అవుతుంది... నోరు తెరిచే ఛాన్స్ ఉండదు!! దీన్నే 'తాంబూల చర్వణ వ్రతం' అంటారు.**

✦ అరుంధతీ నక్షత్రం కనబడక పోయినా కనబడిందని ఎందుకబద్ధం చెబ్తారు నూతన వధూవరులు?
**'అబద్ధం' పెళ్ళికి పునాది అని... అన్యాపదేశంగా చెప్పటానికేమో!... ఫ్చ్!!**






✦ పిల్ల గాలికి... పైరు గాలికి తేడా ఏమిటి?
**పిల్లగాలి తగిలితే... వయసు కూత కొచ్చి(పట్టి)నట్టు! పైరగాలి వీస్తే... పంట కోతకొచ్చినట్టు...!!**

✦ మా ఫ్రెండొకడు పెళ్ళికి ముందు తెగ నవ్వేవాడు... పెళ్ళాయ్యాకనవ్వడమే మానేసాడు... కారణం ఏమిటంటారు?
**సహజమే కదా! కొంపదీసి మీరు పెళ్ళయ్యాక కూడా కొంపలో నవ్వు(గల్లు)తూనే ఉన్నారా ఏంటీ? ఎవరికైనా చూపించుకోండి... అలా వదిలేయకండి!**



✦ ఒక టీనేజ్ కుర్రాడి మెడ మీద సీతాకోకచిలుక పచ్చబొట్టు చూసా... ఎందుకంటారు?
**రొమాంటిక్‌గా ఆలోచించి... సింబాలిక్‌గా పొడిపించుకు నుంటాడు! డెప్తుకెళ్ళి డిస్టర్బ్ అవకండి...చేయకండి!**



✦ తిరిగి చెల్లించనవసరం లేకుండా అప్పులిచ్చే బ్యాంకులేవన్నాఉన్నాయా?
**బెయిలివ్వకుండా జైలుకు పంపే కోర్టులు కూడా ఉన్నాయి... ఆలోచించుకోండి!**



✦ భార్యా రూపవతి శత్రుః అన్నారు కదా... మరి భర్త రూపవంతుడైతే...?

**అంటే, 'అందగత్తె అయిన భార్య శత్రువు అవుతుంది' అని కాదేమో అర్థం! సదరు సౌందర్యవతి వల్ల బోలెడు మంది మగాళ్ళు శత్రువులవు తారని అర్థం!! భర్త రూపం కాదు డేంజర్... డబ్బు! 'భర్తా ధనవంతా శత్రుః'!!**



✦ గతంలో లేని ఓల్డేజ్ హోమ్‌లు ఊరికొకటి పుట్టుకొస్తున్నాయ్... మీ కామెంట్...

**బోర్డింగ్‌స్కూల్స్‌కి తరిమేసిన నాడే... పిల్లలు ఫిక్స్ అయిపోయుంటారు... పేరెంట్స్‌ని ఈ 'హోమ్స్'కి పంపేయాలని! ఇంకా రేషియో పెరిగితే గానీ లెక్క సరిపోదంటున్నారు పిల్లలు!**




✦ నాకు రాత్రుళ్ళు నిద్దట్లో నడిచే అలవాటుంది... అది పోవాలంటే ఏదన్నా చిట్కా చెప్పండి ప్లీజ్!

**ఎవరితో?!... చిట్కా ఏది పోవటానికి?... నిద్రా? నడకా!**







✦ మా ఫ్రెండొహడు వాళ్ళావిడతో తగవు పడినప్పుడల్లా పోయి సన్యాసుల్లో కలుస్తా నంటున్నాడు. అక్కడేవీఁ తిప్పలుండవా?

**తగవు పడే సన్నాసులు ఎవరితో(లో) కలిసినా తిప్పలు తప్పవు! అయినా, 'పోయి'(పోయాక) ఎవరితో కలిస్తే ఎందుకు చెప్పండి!**


✦ క్షవరం అయితే గానీ వివరం రాదంటారు కదా... అయినా వివరం రాకుంటే?

**జుట్టుని పెంచి రెడీ అవ్వాలి...మళ్ళీ క్షవరానికి!!**



✦ బ్రహ్మచారీ శతమర్కటః అన్నారు కదా? మరి పెళ్ళయినవాడు...?

**హే భగవాన్! ఏదైతే ఏంటి ఎండ్రకాయ?! పెళ్ళైనవాడికి సామెతల్లో స్థానం లేదు!**



✦ కూర మాడిపోయినపుడల్లా మా ఆవిడ ఈ కూర పక్కింటావిడ ఇచ్చిందని చెబుతుంది... ఈ అలవాటు మాన్పించటం ఎలా?


**ఏ అలవాటు? ఇలా మాడ్చే అలవాటా? అలా చెప్పే అలవాటా? ముందు మీరు క్లారిటీగా అడిగే అలవాటు చేసుకోవాలి!**



✦ మీరు సినిమాల్లోనటించి మమ్మల్ని నవ్విస్తున్నారు కదా?... మరి మిమ్మల్ని నవ్వించాలంటేనో...

**సినిమాల్లో నటించకూడదు!... కార్టూన్లతో సరిపెట్టాలి!!**





కందర్ప మూర్తి,
8374540331

# నేటి సాధువు!

**ఊళ్లో బెండపూడి సాధువు వచ్చారట... ఆయన ఎన్నో మొండిజబ్బుల్ని నయం చేస్తారట. ఆయన చెయ్యి తాకితే పాము కాటు తిన్నమనిషి లేచి కూర్చుంటారట. పిల్లలు లేని వారికి మంత్రించిన విభూతి నెలరోజులు నుదుటున పెట్టుకుంటే ఆరు నెలల్లో పండంటి బిడ్డ ఒళ్లో ఆడుతాడుట. నల్లగా ఉన్నవారు వారిచ్చిన చూర్ణం కొబ్బరినూనెలో కలిపి నెల రోజులు వంటికి రాసుకుంటే మల్లెపువ్వుఛాయ శరీరం రంగు వస్తుందట.**

**ఇలా ఊళ్లో ఎవరి నోటంట విన్నా ఇవే విడ్డూరపు కబుర్లు.**

అసలే నాగరికతకు దూరంగా వెనక బడిన పల్లె ప్రాంతం.

సాధువులు బాబాలు ఎవరొచ్చినా భయ భక్తులతో వారేది చెప్పినా నమ్ముతారు. చెడుపు, చిల్లంగి, చేతబడి, బాణామతి లాంటి మూఢ నమ్మకాలు, పట్టింపులెక్కువ. అంధ విశ్వాసం. ఎంత ప్రాణాంతక రోగమైనా డాక్టరు దగ్గర కెళ్లకుండా నాటువైద్యాన్ని నమ్ముకుని దుర్మరణం పాలవుతుంటారు అమాయక జనం.

ఊరి చివర చింతతోపులో భారీగా పెరిగిన కొమ్మలతో దట్టంగా ఉన్న చింతచెట్టు మొదట పులి చర్మం మీద గుబురు గెడ్డం తలమీద కొప్పు జుత్తు నుదుటున విభూతి రేఖలు కాషాయ వస్త్రాలు మెడలో రుద్రాక్ష మాలలు కమండలం మీద చేతిలో తులసిమాలతో యోగ నిద్రలో కనబడుతున్నారు బెండపూడి సాధువు గారు. వారి ఇద్దరు శిష్యులు కాషాయ వస్త్రాలు ధరించి తుప్పలతో గురువు గారి చుట్టూ పరిసరాల్ని శుభ్రం చేస్తున్నారు. గురువు గారికి కొద్దిదూరంలో మూటల్లో వస్తు సామగ్రి ఉన్నాయి.

ఉదయాన్నే ఊరి నుంచి పట్నానికి పాలు, కూరగాయలు తీసుకెళ్లే రైతు జనం వింతగా సాధువుగార్ని, శిష్యుల్ని చూసి గుసగుస లాడుతున్నారు.

ఊరి సర్పంచికి, దివాణంగారికి పూజారిగారికి విషయం తెలిసి సమావేశమై బెండపూడి సాధువు గార్ని చూడటానికి బయలు దేరారు.

వారు చింతతోపులో సాధువుగారు బసచేసిన ప్రదేశానికి వచ్చి చూడగా చింతచెట్టు మొదట ధ్యాన ముద్రలో స్వామి, ఆయన చుట్టూ పరిసరాలు శుభ్రం చేసిన శిష్యులు మట్టి కూజా పట్టుకుని నీటి కోసం ఎటుపోవాలో ఎదురు చూస్తున్నారు. ఇంతలో గ్రామ పెద్దలు వారి అవసరాలు తెలుసుకుని గ్రామ తలారి ద్వారా మంచినీరు స్వామి వారికి పాలు, ఫలాలు తెప్పించి సమకూర్చారు. గ్రామ పెద్దలు స్వామికి సాష్టాంగ నమస్కారంచెయ్యగా స్వామి చిరునవ్వుతో వారిని దీవించారు.

శిష్యులను అడిగి బెండపూడి సాధువుగారి వివరాలు, వారు సమయానుకూలంగా ఏమి సేవిస్తారో తెలుసుకున్నారు.

మనుషులను రప్పించి చెట్టు ముందు తాటాకుల పందిరి, వెనక స్వామికి చిన్న పాక వేయించారు. చెట్టు ముందు హోమ గుండం ఏర్పాటు చేసి సదా అగ్ని రాజేస్తున్నారు. సాంబ్రాణి ధూపం పరిసరాల్ని మత్తెక్కిస్తోంది.


బెండపూడి సాధువుగారి వార్త చుట్టుపట్ల గ్రామాలకు పాకింది. ఒక్కొక్కరు సాధువు గారు బసచేసిన గ్రామానికి వరస కట్టేరు.

సాధువుగారు బసచేసిన ప్రాంతానికి ఎడ్లబళ్లు వరస కట్టేయి. టీ బడ్డీలు, గోలీసోడా తోపుడుబళ్ళు, సైకిలు పంక్చరు షాపులు మొదలయాయి.

ఊరంతా సందడిగా మారింది.

బెండపూడి సాధువు గారి దర్శనం, వారు మంత్రించి ఇచ్చే విభూతి పొట్లం, మంత్రించి ఇచ్చిన తావీజు, మూలికల చూర్ణం, తైలం... ధరలు వివరాలు అట్ట బోర్డు మీద రాసిపెట్టారు. చిన్న బేటరీ మైకులో ఇదివరకు సాధువుగారి వద్ద వైద్యం చేయించుకున్న ఎందరో రోగులు... వారి అనుభవాలు రికార్డు చేసినవి వినిపిస్తున్నారు శిష్యులు.

ఉదయం పది గంటల నుంచిసాయంత్రం నాలుగు గంటల వరకే సాధువు గారి దర్శనం లభిస్తుంది.



సాధువుగారు వారి జన్మదినం రోజున ఆశ్రమంలో సంవత్సరానికి ఒకసారి అన్నదానం చేస్తారని... కనుక దాతలు వారికి తోచింది హుండీలో వెయ్యవల్సిందిగా పందిరి మధ్య ఒక ఇనప పెట్టె ఉంచారు.

బెండపూడి సాధువుగారు ఊళ్లో కొచ్చి రెండు వారాలైంది.

ఈ మధ్యలో గ్రామదేవత పండగ రావడం, ఊళ్లో బంధువుల తాకిడి ఎక్కువై సాధువుగారి వద్ద రద్దీ పెరిగింది. ఒక్కొక్కరు స్వామివారి నుంచి మంత్రించిన విభూతి పొట్లాలు, తావీజులు, తైలాలు కొనుక్కుపోయారు. ఈ రెండు వారాల్లోనే సాధువుగారి రాబడి ధన,వస్తు... రూపేణా బాగా వచ్చింది. ఎప్పటికప్పుడు శిష్యులు డబ్బు , విలువైన వస్తువులు వేరు చేసి మూటలు కడుతున్నారు. అప్పుడప్పుడు వారు వెంట తెచ్చుకున్న క్వార్టర్ విస్కీ బాటిల్సు అర్ధరాత్రి ఎవరూ లేకుండా చూసి మజా చేస్తున్నారు.

హుండీలో దాతల డబ్బు బాగానే సమకూరింది.

మంత్రించిన విభూతి పొట్లాలు తావీజులు తైలాలు చూర్ణాలు బాగానే అమ్ముడై డబ్బు బాగానే సమకూరింది. ఇంకా కొద్ది రోజులు ఈ ఊరిలో మకాం ఉంచడమా లేక సమకూరిన డబ్బుతో బిచానా ఎత్తయ్యడమా అని సమాలోచన చేసి హుండీలోని డబ్బు కూడా కలిపి మొత్తం అంతా కూడబెట్టి ఒక రోజున బెండపూడి సాధువు గారు శిష్యులతో అర్ధరాత్రి బిచానా ఎత్తేసారు.



తెల్లవారుజామున గ్రామస్తులు... రోజూ మాదిరి పట్నానికి నిత్యావసర వస్తువులు పట్టుకు వెల్తున్న వారికి చింతతోపులో బెండ పూడి సాధువుగారి పాక పందిరి చుట్టూ ప్రాంతం నిర్మానుష్యంగా కనిపించింది.

ఈ వార్త ఊరంతా పాకింది.

తండోప తండోపాలుగా జనం ఊరి చివర చింతతోపు దగ్గరకు వచ్చి చూడగా పందిట్లోని ఇనప పెట్టె హుండీ కాళీగా కనిపించింది. పాకలో కొన్ని చిల్లర వస్తువులు పడిఉన్నాయి.

గ్రామస్తులకు అర్థమైంది... బెండపూడి సాధువు, శిష్యులు దొంగలని వారు గ్రామస్తులను అమాయకుల్ని చేసి డబ్బు దోచుకుపోయినట్లు తెలుసుకున్నారు.

జనాలలో నిరక్షరాస్యత, అమాయకత్వం, మూఢనమ్మకాలు, అంధ విశ్వాసం కారణంగా నాగరిక ప్రపంచానికి దూరంగా ఉన్నందున దొంగ బాబాలు సాధువుల మాటలు నమ్మి అన్ని విధాల మోసపోతున్నారు.


ఒకచోట మకాం వేసి పది పదిహేను రోజులు వారి మాయమాటలతో అమాయక పల్లె జనాల్ని మోసగించి కావల్సిన డబ్బు సమకూరగానే బిచానా ఎత్తేసి పట్నంలో జల్సాలు చేసి డబ్బులు అయిపోగానే మరో కొత్త ప్రదేశానికి రెక్కీ నిర్వహించి అక్కడి పరిసరాలు వ్యక్తుల గురించి ఆచూకి తీసి మాటల మాంత్రికులు శిష్యులు సాదా దుస్తులు ధరించి బెండపూడి సాధువు గురించి జనాల్లో పబ్లిసిటీ చేసి కొద్ది రోజుల తర్వాత అక్కడ మకాం వేస్తారు.


సిటీలో రోడ్డు పక్కన నాటు వైద్యుల వద్ద ఆకులు అనేక మొక్కల వేళ్లు కొని వాటి పని తీరు తెలుసుకుని గ్రామాలంట సాధువుల వేషంలో విగ్గులు కాషాయ వస్త్రాలు ధరించి ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ మకాం వేసి అమాయక పల్లె జనాలను బురిడీ కొట్టించడం వారి వృత్తి.


షార్ట్‌కట్‌లో గొప్పోల్లైపోవాలనుకునేవాళ్ళు, రాత్రికి రాత్రే పుణ్యం సంపాదించుకోవాలనుకునేవాళ్ళు ఉన్నంత వరకు ఇటువంటి దొంగ బాబాల మోసాలకు పల్లెటూర్లలోనే కావు... పట్నాల్లోనూ బలికాక తప్పదు.

# బాలల దినోత్సవం

చక్రవర్తి










## కాపాడిన ఆ ఒక్క మాట.

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ గొంతు సవరించుకుని- "పొద్దున్న లేచీ లేవగానే కళ్ళు నులుముకుని అటూ, ఇటూ బిత్తర చూపులు చూశాడు మధు. రాత్రి పూటుగా మందు తాగి ఇంటికి వచ్చిన విషయం గుర్తుకు వచ్చింది. అంతే ఉన్నట్టుండి భయంతో మలేరియా జ్వరం వచ్చిన వాడిలా గజగాజా వణికిపోయాడు. కారణం, మందు తాగి వస్తే, మరుసటిరోజు పొద్దున్న అన్ని పనులూ బంద్ చేస్తుంది అతని భార్య. పైగా తన భార్య సూర్య కళ తిట్టే తిట్లు, దెప్పిపొడుపులూ కూడా చాలా ఘోరంగా




ఉంటాయి. అయితే ఇవన్నీ అతను ఇదివరలో కొంచెం మందు పుచ్చుకుని ఇంటికి వచ్చినందుగ్గాను జరిగినవి. అలాంటిది అతను గత రాత్రి దాదాపు స్పృహ లేకుండా ఇల్లు చేరాడు... దాంతో ఇపుడు తన భార్య ఏవంటుందో... ఏం జరుగుతుందో... అని గుండెలు అర చేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ మంచం పైనుండి లేస్తూ...

'వద్దంటే ఆ శేఖరంగాడు వినకుండా కొంచెం ఎక్కువ పోసేసాడు. ఆ మత్తులో జరిగిందేం గుర్తురావడం లేదురా దేవుడో!' అని పిల్లిలా అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా హాల్లోకి వచ్చాడు. తర్వాత ఓసారి ఇల్లంతా కలియ జూశాడు.

ఇంట్లో సూర్యకళ లేదు... హమ్మయ్య అని కాస్త తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. కానీ ఫ్రిడ్జ్ పై ఏదో ఓ కాగితం అంటించి ఉండటం చూసి మధు గుండె గుబేలుమంది.

దగ్గరకెళ్ళి ఆ పేపర్ని చేతిలోకి తీసుకున్నాడు.

'నేను పక్కింటి సరళతో కలిసి రైతు బజార్కి వెళ్తున్నాను. అటునుంచి అటు సూపర్ మార్కెట్ కూడా వెళ్ళివస్తాను. మీ కోసం ఆరెంజ్ జ్యూస్ చేసి ఫ్రిడ్జ్లో పెట్టాను... మరిచిపోకుండా తాగండి!... అలాగే నేను వచ్చేసరికి ఆలస్యం అవుతుందని ఉప్మాని హాట్ కెరీర్లో పెట్టి ఉంచాను. మరిచిపోకుండా తినండి!' అని ఉంది.

ఓ క్షణం చాలా ఆశ్చర్యంగా అనిపించింది మధుకి.

ఏంటి నాపై ఇంత ప్రేమ. జ్యూస్ తాగుదామా అని చేయి చాచాడు. కానీ ఎటుపోయి ఎటుస్తుందో అనే భయంతో వాటిని వాసన చూసే సాహసం కూడా చేయలేదు. మామూలుగా ఓ మోస్తరుగా తాగి ఇంటికి వస్తేనే పెద్ద రాద్ధాంతం చేసే మనిషి, నిన్న దాదాపు స్పృహ లేకుండా ఇంటికి వచ్చినా కనీసం ఓ మాట అనలేదు... పైగా జ్యూసు, బ్రేక్ ఫాస్ట్ కూడా సిద్ధం చేసింది...

ఎందుకు ఇలా అని జుత్తు పీక్కుని కొంతసేపు ఆలోచించాడు. కానీ ఏం తట్టలేదు. ఇహ ఇలా లాభం లేదని, ఇంట్లో ఉన్న పన్నెండేళ్ళ కొడుకు బాబీని దగ్గరకి పిలిచి-

"రాత్రి ఏమైంది?" అడిగాడు.

దానికి బాబీ- "నువ్ దాదాపు స్పృహ లేకుండా వచ్చావ్. అమ్మ నిన్ను బెడ్రూంలో పడుకోబెట్టింది!" చెప్పాడు.

"అయితే మరి మమ్మీకి కోపం గట్రా రాలేదేంటి? మామూలుగా అయితే ఈ పాటికి మన ఇల్లు పీకి పందిరేయాలికదా! ఇలా ప్రశాంతంగా ఉందేవిటి, అసలు ఏమైంది?" అడిగాడు భయంగా చూస్తూ.

"ఓహ్హో అదా? నేను నీలాగే అనుకున్నాను. పొద్దున్న తన్ని లేపి మరీ నిన్ను ఉప్పు పాతర వేస్తుందని. కానీ నిన్న, అమ్మ నీ చొక్కా మార్చబోతుంటే... నువ్వన్న ఆ ఒక్క మాటా నిన్ను కాపాడింది డాడీ!" చెప్పాడు బాబీ.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! ఆమె అతని చొక్కా మారుస్తుండగా, శేఖరం సలహా మేరకు అతను ఏవని కలవరించి ఉంటాడు."

"ఇకపై మందు తాగననో లేక మందు మానేస్తా అనో అనుంటాడు సార్! దాంతో ఆమె కోపం పోయింది అంతేనా సార్!"

"కాదు తమరి బొంద! ఆమె చొక్కా మారుస్తుండగా... 'అమ్మాయ్ నాకు దూరంగా ఉండు! నాకు పెళ్ళై అందమైన భార్య ఉంది నన్ను వదిలేయ్' అన్నాడు. దాంతో ఆమె మనసు ఉప్పొంగిపోయింది. దాంతో అతన్ని ఈసారికి క్షమించింది. అదీ జరిగింది... నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...


"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!" అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా **ఒక అంశం** మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- మంత్రదండం























'మంత్రం' చదువుతూ, 'దండం' పెడితే దాన్ని 'మంత్రదండం' అనరు శిష్యా!



ఏమయ్యా, ఎన్నాళ్ళు తిప్పుకుంటావ్?



మంత్రగాడా! దానిని అలా పట్టుకొని నన్ను "కోతిగా మారిపో" అన్నావు.... చూడు ఏమయిందో....
పెండేల



csk


లక్ష రూపాయల ఈ మంత్ర దండం యొక్క మహత్యం ఒకరోజు గడిచాక మీకే తెలుస్తుంది.....
2022
14
OCTOBER
?
2022
15
OCTOBER


అన్నిరకముల మంత్రదండములు రిపేరు చేయబడును.
డా॥ మంత్రేశ్వర్


పూర్వం మాంత్రికుల వద్ద మంత్రదండాలు, మాయలుండేవి....! మీకర్థమవ్వాలంటే, యిప్పటి మంత్రుల వద్ద మంత్రి పదవులు, హామీలు లాంటివన్నమాట....!


BUS BAY
పొగడ్తలుండగ... మంత్రదండమేల దండగ..
నిరంజన్



డి.వి.డి.ప్రసాద్,
9437094331

# ఘన సన్మానం

**ఆదివారం ఉదయం పెందరాళే లేచి తన కవితా సంపుటి చదువుతూ అంతులేని ఆనందంలో మునిగితేలుతున్నాడు కవీశ్వర్రావు. అతని అసలు పేరు కే.పి.ఈశ్వర్రావు అయినా కవితలు రాయడం ప్రారంభించి లోకం మీదకి దండెత్తిన తర్వాత తన పేరు కవీశ్వర్రావుగా మార్చుకున్నాడు.**

అతనంటే కిట్టనివాళ్ళు మాత్రం చాటుగా కపీశ్వర్రావని అంటారు. అలా తన్మయత్వంలో మునిగితేలుతూ కవితామృతం గ్రోలుతూ ఉండగా, హఠాత్తుగా కాలింగ్ బెల్ మోగడంతో వచ్చింది ఎవరబ్బా అనుకొని తలుపు తీసాడు.

ఎదురుగా ఉన్న అపరిచితుణ్ణి ప్రశ్నార్థకంగా చూసాడు.

తెల్లటి కుర్తా పైజామావేసుకొని ఉన్నాడు. భుజానికో బ్యాగ్ వేలాడుతోంది. టివిలో వచ్చే సబ్బులు, వాషింగ్ పౌడరు ప్రకటనలకి మల్లే ఉంది అతని వాలకం.

అయితే చేతిలో హస్తభూషణమైన పుస్తకం చూసి ఆ బాపతు కాదేమోనని అనుకున్నాడు.

"నమస్కారం కవీశ్వర్రావుగారూ! నా పేరు సదానందం... నేను 'కవి నిలయం' సంస్థ యొక్క అధ్యక్షుణ్ణి. అంతేకాక మీ వీరాభిమానిని...మీలాంటి గొప్ప కవిని కలవడం నా పూర్వజన్మ సుకృతం, అదృష్టం కూడాను." అన్నాడు సదానందం... చిదానందంగా నవ్వుతూ.

ఆ మాట వినగానే కవీశ్వర్రావు ముఖం కలువలా వికసించింది.

ఇన్నాళ్ళి తను కపిత్వం సారీ... కవిత్వం రాస్తూంటే తనని ఏ సంస్థ ఇంతవరకూ గుర్తించలేదు మరి! తనకి, తన కవిత్వంకి రావలసిన గుర్తింపు రాలేదని తెగ బాధపడి పోతుండేవాడు... ఇన్నాళ్ళకి ఆ బాధ చేతితో తీసినట్లు మాయమైంది సదానందం మాటలు అతని చెవులకు సోకగానే.

మొట్టమొదటిసారిగా తనలోని ప్రతిభ గుర్తించి నేరుగా తన ఇంటికి వచ్చినందుకు కవీశ్వరరావు ఛాతీ ఓ రెండుఇంచీలు పెరి గింది. ముఖం చింకి చేటంత అయింది.

"రండి!...రండి!...లోపలికి రండి!" సాద రంగా అహ్వానించి కూర్చోడానికి సోఫా చూపెట్టాడు.

ఆ సదరు సదానందం సోఫాలో సుఖాశీను డయ్యాక కవీశ్వర్రావు భార్యని కేకేసి ఇద్దరికీ కాఫీ తెమ్మని చెప్పాడు.

"మీకు మా సంస్థ 'కవి నిలయం' గురించి తెలిసే ఉంటుంది. మీలాంటి గొప్ప కవుల్ని, రచయితల్ని గౌరవించడం, సన్మానించడం మా ముఖ్య ఉద్దేశ్యం." అన్నాడు ఉపోద్ఘాతంగా.

వాస్తవానికి ఆ సంస్థ పేరెప్పుడూ కవీశ్వ ర్రావు వినలేదు. నిజానికి అతనికి కూడా సన్మా నించుకోవాలన్న కోరిక మెండుగా ఉంది. డబ్బులు తీసుకొనైనా సన్మానించేవాళ్ళకోసం కళ్ళు కాయలుగాచేలా వేచి ఉన్న తనకు ఇన్నాళ్ళకి భగవంతుడు కరుణించాడు సదా నందం రూపంలో అని పొంగిపోయాడు.


కవినిలయం అనే సంస్థగురించి తెలియక పోయినా, "ఆc...విన్నాను!" అని అన్నాడు.

"మీకు తెలుసుకాబట్టీ నేను మా సంస్థ గురించి ఎక్కువగా చెప్పుకొనేది లేదు... మా సంస్థ ఏర్పాటైనప్పటి నుండి ప్రతీ సంవత్సరం ఉగాదినాడు ఓ ప్రముఖ కవిని సన్మానించు కోవడం ఓ అనావాయితీగా మారింది. ఈ సంవత్సరం మిమ్మల్ని మించిన కవి లేరని తెలిసి ఇలా వచ్చాను. మరి తమరు అను మతిస్తే... కానీ..."అని నసిగాడు సదానందం.

సన్మానం అన్నమాట వినగానే తబ్బుబ్బయి పోయిన కవీశ్వరరావు–

"ఓ దానికేం భాగ్యం!" అన్నాడు తను రెడీ అన్నట్లు.

అయితే, ఈ 'కానీ' ఏంటో అర్థంకాలేదు కవీశ్వర్రావుకి. అయినా ఇవాళ రేపు కానీలు, అణాలు చెల్లవుకదా... సన్మానానికి డబ్బులు అడగదలచుకుంటే ఎలాగూ వేలల్లోనో లక్ష



ల్లోనో అడుగుతాడని తెలుసతనికి. ఎంత తన అభిమాని అయినా ఊరికే సన్మానం చేయడు కదా! అందుకే అడిగాడు–

"ఎంత ఖర్చు అవుతుందేమిటి?"

ఆ మాట వినగానే నొచ్చుకున్నట్లు మొహం పెట్టి– "మీరు మా సంస్థ యొక్క ఆశయాన్ని అపార్థం చేసుకుంటున్నారు. మేము సన్మానం చేయడానికి ఎవరి వద్ద నుండీ ఏమీ తీసుకోము. కాకపోతే పై ఖర్చులు ఉండటంవల్ల మాకు డబ్బులు తీసుకోవడం తప్పడం లేదు. మీ వద్దనుండి తీసుకున్న డబ్బులతో మీ పేరు మీద మేమో మంచి పని చేస్తాం!... ఉదాహరణకి ఏ పాఠశాలకో లేక వృద్ధాశ్రమానికో, అనాథాశ్రమానికో విరాళం ఇస్తాం." అన్నాడు సదానందం.

ఎలాగు సన్మానం దురదున్న కవీశ్వర్రావు– "ఎలాగూ ఓ మంచిపని చేయడానికి తీసుకుంటున్నారు కాబట్టి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు... ఇంతకీ ఎంత అవుతుందేమిటి?..." సందేహం వెలిబుచ్చాడు కవీశ్వర్రావు.

"ఆఁ...ఏంతోనా?... ఎంతో లేదండి! ఓ రెండు లక్షలు ఉంటే చాలు, నిండు సభలో మీకు భారీగా సన్మానం ఏర్పాటు చేయిస్తాను సరేనా!" అన్నాడు సదానందం.

"అమ్మో రెండు లక్షలా!' అని కవీశ్వర్రావు గుడ్లు తేలేయడం చూసిన సదానందం...

"మేం చేసే సన్మానంకి డబ్బుతో వెలకట్ట కూడదండీ! ఇందులో మిగిలిన డబ్బులు విరాళంగా ఇస్తాం కదా! అంతేకాక, నిండు సభలో సన్మానం చేయించుకోవడం ఎంత గౌరవమో ఊహించుకోండి!" అన్నాడు సదానందం.

"నిండు సభ అంటున్నారు, అసలు అంత మంది సన్మానానికి వస్తారంటారా?" రెండు లక్షల రూపాయలు పుచ్చుకొని బొత్తిగా ఓ అరడజను మందిని సభకి పిలుస్తాడేమోనని మనసులో పీకుతూనే ఉంది ఓ మూల.

"అన్నన్న! ఎంతమాట!... నాది మాటంటే మాటే! వందమందికి తగ్గకుండా మీ సన్మానం ఏర్పాటు చేయించే పూచీ నాది!" హామీ ఇచ్చాడు సదానందం.

భార్య కాంతానికి ఆ సన్మానానికి అంత డబ్బు ఖర్చు పెట్టడం ఇష్టం లేకపోయినా ఆమెని బలవంతాన ఒప్పించి సదానందం అడిగిన రెండు లక్షలూ సమర్పించి తనకు జరగబోయే సన్మానం తలచుకుంటూ కలలు కనసాగాడు కవీశ్వర్రావు.

✦ ✦ ✦


సన్మానం జరిగే రోజు రానే వచ్చింది.

కవీశ్వర్రావు తనకోసం పంపిన కారులో వెళ్ళాడు సతీసమేతంగా.

తన పేరును ఆ సభ స్వాగత తోరణంలో చూసి పొంగిపోయాడు.

కవీశ్వర్రావు వెళ్ళేసరికి సదానందం ఒక్కడే హడావుడి పడుతూ కనిపించాడు.

సభ యధావిధిగా నిర్ధారించిన సమయానికి ఓ గంట ఆలస్యంగా ప్రారంభమైంది.



అరడజను కాకపోతే డజనుమంది వస్తారేమో అనుకున్న కవీశ్వర్రావు అంచనా తలకిందు లైంది. ఆ హాల్లో వేసిన వందకు పైగా ఉన్న కుర్చీలన్నీ నిండిపోవడం చూసి ముందు ఆశ్చర్యపోయి ఆ తర్వాత బోలెడు ఆనంద పడిపోయాడు.

అంతమంది తన సన్మానసభకి హాజరవడం చూసిన కవీశ్వర్రావుకి మతిపోయింది. తనకి అంతమంది అభిమానులున్న సంగతి ఆ రోజే తొలిసారిగా తెలిసొచ్చిదతనికి.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సదానందం వైపు ప్రశంశాపూర్వకంగా చూసాడు.

ముందువరసలో కూర్చున్న భార్యవైపు చూసి గర్వంగా తలెగరేసాడు.

ముఖ్యవక్త ప్రసంగం ముగిసిన అనంతరం కవీశ్వర్రావుకి సన్మానం చేసి అతనికి శాలువ కప్పి, అతను సమర్పించిన డబ్బుల్లోంచే ఓ వెయ్యినూట పదహార్లు వేదిక మీద అంద జేసాడు ఆ ఊరి ప్రముఖ రాజకీయనాయకు డైన వరహాలు.

అర్థంకాని రాజకీయ భాషలో మాట్లాడిన అతని ప్రసంగంలో తన గొప్పతనం, తన పార్టీ గొప్పతనం గురించిన అధిక ప్రసంగమే ఎక్కువ వినబడింది. తనకి జరిగిన సన్మా నానికి, సభకి హాజరైన తన అభిమానుల్ని చూసి పరవశించిన కవీశ్వర్రావు నోట కవిత్వం వరదలై పారింది.

తన కవిత్వం, ప్రసంగం శ్రద్ధగా విన్న ఆహుతులందరికీ తన ధన్యవాదాలు తెలిపాడు.

ఘనంగా సాగిన ఆ సన్మాన సభ ముగిసిన తర్వాత కవీశ్వర్రావు సదానందంవైపు మెచ్చుకోలుగా చూస్తున్నప్పుడు అతని దృష్టి అక్కడున్న ఆ పాఠశాల పేరు ఉన్న బోర్డుపై పడింది. అది చదివిన కవీశ్వర్రావు ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

ఆ బోర్డుపైన ఉన్న అక్షరాలు, 'శాంతినికేతన్ బధిరుల పాఠశాల' అతన్ని వెక్కిరించాయి.

బయలుదేరుటకు సిద్ధంగా ఉన్న ముఖ్యవక్త వైపు చూసేసరికి అతను అప్పుడే జేబులోంచి వినికిడి యంత్రం జేబులోంచి బయటకి తీసి చెవిలో పెట్టుకుంటున్నాడు.

అప్పుడు అర్థమైంది కవీశ్వర్రావుకి తన కవిత్వం అంత ఓపిగ్గా శ్రోతలు ఎలా వినగలి గారో అన్న సంగతి.

తలతిప్పి సదానందం వైపు చూసేసరికి అతను ఆ పాఠశాలకి పదివేల రూపాయలు విరాళం, ఇతర ఖర్చులు చెల్లించిన తర్వాత మిగిలిన లక్షరూపాయాలు జేబులో వేసు కుంటూ చాలా హుషారుగా కనిపించాడు.


అతన్ని నిలదీయాలని కోపంతో దగ్గరికెళ్ళే సరికి– "కవీశ్వర్రావుగారు!...చూసారా మీ సన్మాన కార్యక్రమం ఎంత ఘనంగా జరిపిం చానో! నేను నా మాట నెరవేర్చుకున్నాను. చూసారు కదా! వందమందికన్న ఎక్కువ శ్రోతలే వచ్చారు." చిరునవ్వులు చిందుస్తూ అంటున్న చిందానందాన్ని మతిపోయి చూస్తున్న కవీశ్వర్రావు నోట మాట వస్తే ఒట్టు!


కక్కలేక మింగలేక సదానందవైపు చూస్తున్న కవీశ్వర్రావు అవస్థ గమనించిన కాంతానికి నవ్వు ఆగింది కాదు.

## ఈ నెల 'దినం'

### నవంబర్ 13- వరల్డ్ కైండ్‌నెస్ డే






# నచ్చిన కార్టూన్‌కు కానుక!





కార్టూనిస్టు శ్రీ టి.ఆర్.బాబు, తమ తల్లి దండ్రులు శ్రీ తోట జగన్నాథరావు, సరోజినీ గార్ల స్మారకంగా, హాస్యానందంకు ఈ నెల వచ్చిన కార్టూన్‌లోంచి ఈ 6 కార్టూన్లకు 100 రూపాయలు చొప్పన బహుమతులు ఇస్తున్నారు.











డా॥ శ్రిష్టి శేషగిరి,
9290652632

# తగ్గేదేలే...

**'అసలు ఈ వాహనం ఎవరు కనిపెట్టారో?... దానిలో పోసేందుకు పెట్రోల్ ఎవరు కనిపెట్టారో? ఎంచక్కా వెనకటి కాలమే నయం... ఎడ్లబండి, గుర్రంబండి, జట్కాబండ్లు ఉండేవి.'... రోజురోజుకీ కాదు కాదు... నిమిష నిమిషానికీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను తలచుకుని బావురు మంటున్న ఓ సగటు భారతీయుడు అప్పారావు!**

'ఈ రోజు ధర ఎంతో దేవుడికే తెలియాలి!' అనుకుంటూ తప్పదు కదా అని పెట్రోల్ బంకు ముందు ఆపాడు బండిని ఆయాసంతో తీసుకువచ్చి.

"ఎంత కొట్టమంటారు సార్?" అడిగాడు బంకువాడు.

"ఓ హండ్రెడ్ కొట్టు." అన్నాడు వీరలెవెల్లో ఫోజు కొడుతూ అప్పారావు.



'వందరూపాయల పెట్రోల్‌కి వెయ్యి రూపాయల బిల్డప్' లోలోన అనుకుంటూ బంకు వాడు పెట్రోల్ పొయ్యబోయాడు.

"ఆగాగు! ఏంటి నువ్వు చేస్తున్నది!" అని గట్టిగా గావుకేక పెట్టాడు తెగ ఆవేశంగా అప్పారావు.

అతని కేకలు విని బంకులో వాళ్ళంతా జడుసుకు చచ్చారు.

"ఏంటిసార్?... మీరు పెట్రోల్ పొయ్యమన్నారు... నేను పోస్తున్నాను. అందులో తప్పేముంది?" ఏదో పిచ్చికుక్క కరిచిన వాడిలా ఎందుకా అరుపులు అని అనబోయి మనసులోనే దాచుకున్నాడు.

"అవును పెట్రోల్ పోయమన్నాను. కాని దీనితో కాదు." అన్నాడు పెట్రోల్ కొట్టే గన్‌ని చూపిస్తూ.

'ఇదెక్కడి తింగరి గోలరా పొద్దున్నే' అనుకుని– "మరి ఎలా పోయాలి పెట్రోలు?..." దీర్ఘంగా అన్నాడు బంకువాడు... అసహనాన్ని అణుచుకుంటూ.

"నేనడిగింది ఎంత పెట్రోల్?" అన్నాడు అప్పారావు.

"వంద రూపాయలు సార్?" అన్నాడు. నా చెవులు ఇంకా బాగానే పనిచేస్తున్నాయి అనుకుంటూ.

"అక్కడే నువ్వు పప్పులో కాదు... కాదు! పెట్రోల్‌లో కాలేసావు తమ్ముడు. నేనడిగింది హండ్రెడ్ డ్రాప్స్ పెట్రోల్." అన్నాడు అప్పారావు పిచ్చి నవ్వు నవ్వుతూ.



అది విన్న పెట్రోల్ బంక్ బాయ్‌కి మైండ్ బ్లాంకైంది.

తన ఇరవై ఏళ్ళ సర్వీసులో ఇలాంటి తిక్క కేసుని చూడ్డం ఇదే మొదటిసారి.

"ఏంటి సార్!... వంద చుక్కల పెట్రోల్ పొయ్యాలా? అసలు వంద చుక్కల పెట్రోల్ ఎవరైనా పోస్తారా?" అంటూ వీరావేశంతో చిందులేసాడు.

అతనిలో ఆవేశం చూసిన అప్పారావు–

'పెరిగిపోతున్నది... నిమిష నిమిషానికి పెట్రోల్ డీజిల్ ధరలే కాదు మనుషుల బీపీ కూడా.' అనుకుంటూ అతనితో–

"కూల్‌డౌన్ మై బాయ్! కూల్‌డౌన్!!... ఎందుకంత ఫైర్ అవుతావు. నువ్వు పనిచేస్తున్నది పెట్రోల్ బంకులో తమ్ముడూ! అంత ఆవేశం పనికిరాదు. నీలో వేడికి ఇంకాస్సేపాగితే ఈ పెట్రోల్ బంకు తగలడిపోయేది తెలుసా?" అని అప్పారావు అతన్ని కూల్ చేసాడు.

"మరి లేకపోతే ఏంటి సార్! మీలాంటి కస్టమర్ రోజుకొక్కడు కాదు కదా మా వ్యాపానికి!! మొన్న ఒకడు వచ్చి పెట్రోల్ పదిచుక్కలు తగ్గాయని నానా యాగీ చేసాడు...


నిన్నటికి నిన్న ఒకడు వచ్చి ఇంకు పిల్లరు తెచ్చి ఇందులో పెట్రోల్ పొయ్! అన్నాడు. నేనెవరికి చెప్పుకోవాలి నా గోడు!" అని మళ్ళీ జుత్తు పీక్కుంటూ రెచ్చిపోయాడు బంకువాడు.

"బాబ్బాబు! నువ్వు మళ్ళీ ఫైర్ అవకు... కూల్ కూల్! కనీసం నేను ఇక్కడినుండి కదిలేదాకా నీ ఆవేశాన్ని ఏ పెట్రోల్‌లో డీజిల్‌లో పోసుకుని చల్లార్చుకోవోయ్!..." అంటూ పెట్రోల్ ధరల సూచిక కేసి చూసాడు.

అప్పారావుకి అనుకోకుండా గుండె కొట్టుకునే వేగం అమాంతం పెరిగిపోయింది.

ఈ రోజు పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల పట్టికని చూసి అక్కడికక్కడే కళ్ళు బైర్లు కమ్మి పట్టపగలే చుక్కలు కనిపించాయి అప్పారావుకి.

ఆ షాక్‌కి తన బైక్‌ని అక్కడే వదిలేసి వెనక్కు తిరిగి చూడకుండా వంద కిలోమీటర్ల వేగంతో రాకెట్‌లా బయటకు పరుగు పరుగున... దూసుకుపోయాడు అప్పారావు.





ఆర్.సి.కృష్ణ స్వామి రాజు,
9393662821

# ముక్కు పుడక

**చెన్నై సిటీలో నివాసముండే యువ సినీనటి భువన తన సొంత ఫ్లాట్‌లో టీవీ సీరియల్ చూస్తూ ఉంది. హీరోయిన్ పాత్రధారి ముక్కుపుడక మిలమిలా మెరుస్తుంటే నటి భువన మనసులో ఓ ఆలోచన ఫ్లాష్‌లా మెరిసింది.**

పర్సనల్ అసిస్టెంట్‌కి చెప్పి ముక్కుపుడక పెట్టుకున్న హీరోయిన్లు, ఇతర రంగ ప్రముఖుల ఫోటో అల్బం చేయించింది. ముక్కు పుడక పెట్టుకుంటే తన అందం పెరిగి ఇండస్ట్రీలో మరింత మార్కెట్ పెరిగే అవకాశం ఉందని భావించింది.

వెంటనే పర్సనల్ బ్యూటీషియన్‌కి ఫోన్ చేసింది. తను ముక్కుపుడక కుట్టించుకోవాలనుకున్నట్లు చెప్పింది. తొందర పడవద్దని చెప్పిన బ్యూటీషియన్, ఫోటోగ్రాఫర్‌ని వెంటబెట్టుకుని ఆఘమేఘాల మీద యువనటి ఇంటికి చేరింది. యువనటి సంపెంగ ముక్కుకి పెట్టుడు ముక్కు పుల్లలు పెట్టి రకరకాల భంగిమల్లో ఫోటోలు తీయించింది.

యువనటి తన మెయిల్ ద్వారా ఫోటోలు పంపి ఓ సీనియర్ డైరెక్టర్ అభిప్రాయం కోరింది.

'అందాల ముక్కు... ముచ్చటైన ముక్కు ... ముక్కు పుడక పెడితే సూపర్ డూపర్...' అని ఒకటికి పదిసార్లు పొగిడాడు.

తనకి ఫేవర్‌గా ఉండే సహ నటీమణులతో చర్చించింది. వాళ్ళంతా 'ఓకే' చెప్పారు. అంతే కాకుండా తన ఫాలోయర్స్ వుండే ఫేస్‌బుక్ గ్రూప్‌లో ఓటింగ్ పెట్టింది.

మెజారిటీ మిత్రులు 'డబుల్ ఓకే' చెప్పారు.

అక్కడితో ఆగకుండా భవిష్యత్తులో వేలికి ఉంగరం తొడగబోయే కుర్ర హీరో అభిప్రాయం అడిగింది.

'ముక్కు మీద పుడక... నీ ముఖానికే అందం..' అని పాట పాడి పచ్చజెండా ఊపడంతో ఎగిరి గంతులేసింది.

ముక్కు ఎక్కడ మంచిగా కుడుతారోనని గూగుల్‌లో సెర్చ్ చేసింది. తమిళనాడు రాష్ట్రంలో సుబ్రమణ్యస్వామి కొలువైన తిరుత్తణి గుడి దగ్గర బాగా కుడుతారని తెలుసుకుంది.

'స్వామి కార్యంలో స్వకార్యం! అటు దేవుణ్ణి చూసినట్లు ఉంటుంది... ఇటు ముక్కు కుట్టించుకున్నట్లూ అవుతుంది' అని ఆలోచన చేసింది.


అదే విషయాన్ని అమ్మ బుజ్జమ్మతో చెప్పింది.

పట్టుచీర కుచ్చిళ్ళు చిన్నగా సవరించుకుంటూ బుజ్జమ్మ- "ఎవరో కర్పూరం వెలిగించి టెంకాయ కొడితే మనం దండం పెట్టాలి కానీ మనం ఖర్చు పెట్టకూడదు. నీకు అనుభవం తక్కువ. నడిపించాల్సిందంతా నేను నడిపిస్తాగా..." అని చేతులు ఊపుతూ చెప్పింది.

గబగబా పేరున్న మూడు యూ ట్యూబ్ ఛానెల్స్ హెడ్స్‌కి ఫోన్ చేసింది.

కూతురి 'నోస్ బోరింగ్ ఫంక్షన్' విషయం చెప్పింది. మొత్తం షూట్ చేసి మార్కెట్లోకి విడుదల చేయడానికి ఫోన్‌లోనే టెండర్స్ పిలిచింది. మంచి ధర పలకడంతో 'చింగ్ చాంగ్' అనే బెంగళూరు యూ ట్యూబ్ బృందానికి అవకాశం ఇచ్చింది. షూటింగ్ స్పాట్ ఖర్చులు, రక్షణ లాంటి వ్యవహారాలు కూడా వారే చూసుకోవాలని అగ్రిమెంట్‌లో రాయించింది.

విషయం తెలిసిన ప్రేక్షకులు నటి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయానికి ప్రశంసల వర్షం కురిపించారు.




'బోల్డ్ లేడీ, ఉక్కు మహిళ' అని కితాబు లిచ్చారు.


'ఆ రోజు మేడమ్ చీర కడతారా, లేక డ్రెస్సు వేస్తారా? ఏ రంగు గుడ్డలేస్తారు?' అని కాలేజీ అమ్మాయిలు ఊహాగానాలు చేయడం ప్రారంభించారు. 'ముక్కు కుడి, ఎడమలలో ఏ వైపు కుట్టించుకుంటుందో మేడమ్' అని మీసాలు వచ్చీరాని కుర్రకారు 'బెట్' లు కాశారు.

'ముక్కు కుట్టించుకునేటప్పుడు మేడమ్ మనో భావాలు ఎలా ఉంటాయో' అని సైకాలజిస్టులు అంతర్జాల వేదికల్లో రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

'సినీరంగ ప్రవేశం చేశాక ఏ ఏ హీరోయిన్లు ముక్కు కుట్టించుకున్నారు?... వారి మార్కెట్

ఎలా ఉంది...' లాంటి గణాంక వివరాలు పొందుపరుస్తూ కొందరు విశ్లేషకులు డిబేట్లకు తెర తీశారు.

ఎవ్వరూ అడగకపోయినా కొందరు వైద్యులు యూ ట్యూబ్ వేదికగా కొన్ని సలహాలు ఇచ్చారు. 'ముక్కు కుట్టించుకునేటప్పుడు ముందు జాగ్రత్తగా యాంటీ సెప్టిక్‌గా ఏ లోషన్ వాడాలి, ఎలాంటి టిష్యూ పేపర్లు వినియోగించాలి' అని చక్కటి సలహాలు సూచించారు. తప్పుజారి ముక్కు వద్ద సెప్టిక్ అయితే ఎలాంటి వైద్యం అందించాలో కూడా తెలియ జేశారు. అలాంటి సమస్యే ఎదురైతే చెవి, ముక్కు, గొంతు... భాగాలపైనా దాని చెడు ప్రభావం ఉంటుందని హెచ్చరికలు చేశారు.



అవకాశమిస్తే తాము పైసా తీసుకోకుండా కార్పొరేట్ వైద్యం అందిస్తామని ముందు కొచ్చారు.

✦ ✦ ✦

చివరిసారిగా తన మామూలు ముక్కును అద్దంలో చూసుకుని కారు ఎక్కింది మేడమ్.


ఒత్తిడిగా ఉండటంతో ఎవ్వరికీ కనిపించ కుండా డాక్టర్లు ఇచ్చిన స్ట్రెస్‌బాల్ నొక్కు కుంటూ ప్రయాణం చేసింది.

'టంగు టపారం' ఎత్తుకుని కార్య క్రమాన్ని కవర్ చేయడానికి మేడమ్‌తో పాటు చింగ్ చాంగ్ యూ ట్యూబ్ యూనిట్ కూడా తిరుత్తణి వెళ్ళారు. ఎక్కడా హడావుడి చేయకుండా మెత్తగా కార్యక్రమం ప్రారంభించారు. అగ్రిమెంట్ చేసుకున్న సంస్థ తప్పితే మిగతా ఎవ్వరూ ఫోటోలు కానీ వీడియోలు కానీ తీసుకోకుండా చుట్టూ కాపలా పెట్టారు. విషయం తెలుసుకున్న పోటీ నటీమణులకు కడుపు మంట, కడుపు లో మంట మొదలైనాయి.

యూ ట్యూబ్లో లైవ్‌ని ప్రసారం చేయడంతో పదివేల మందికి పైగా ప్రేక్షకులకు కనువిందు కలిగింది. పనిలో పనిగా పల్లెలో అయిదు వరకు చదివిన మేడమ్ క్లాస్‌మేట్‌ల అభిప్రాయాలు సేకరించారు. అందులో ఒక అమ్మాయి, చిన్న పుడు మేడమ్ కాలిలో ముళ్ళు గుచ్చుకున్న చిన్న నాటి సంఘటన వివరిస్తున్నప్పుడు అభి మానుల గుండెలు చెరువులయ్యాయి.

'అయ్యో! మన అభిమాన నటి ముక్కు




కందిపోతుందేమో' అని కొందరు అభిమానులు బాధ పడ్డారు.

'ముక్కు కుట్టుడు పూర్తి అయ్యేంతవరకు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టం' అని వీరాభిమానులు శపథం చేశారు.

ఎలాగైతేనేం...కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి అయ్యింది. చిన్న సైజు నొప్పి ఉన్నా ఎక్కడా ఆ తాలూకు ఛాయలు ముఖంలో కనబడకుండా చక్కగా నటించింది మేడమ్. నవ్వుల పువ్వులు విసురుతూ అభిమానులకు "హాయ్ హాయ్" చెప్పింది.

"అభిమానుల ప్రార్థనలే నాకు జీవశక్తి" అని సహకరించిన అందరికీ ఊగుతూ ఊగుతూ ధన్యవాదాలు తెలిపింది.

జనం స్పందనకు యువనటి తల్లి బుజ్జమ్మ ముక్కు మీద వేలేసుకుంది. తను పైట వేసిన కొత్తల్లో, ఊర్లో రావి చెట్టు కింద కన్ను మూసి తెరిచేలోగా ముక్కు కుట్టించుకున్న విషయం గుర్తుకొచ్చి ముసిముసిగా నవ్వుకుంది. 'దేనికైనా పెట్టి పుట్టాలి' అని మనసులోనే అనుకుంది. అయినా మనకి కావాల్సింది 'మాటల మూటలు కాదు...డబ్బు మూటలు కదా!' అని గమ్మున ఉండిపోయింది.

అంతా అనుకున్నది అనుకున్నట్లు జరగడంతో చింగ్ చాంగ్ యూనిట్ 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు.

అభిమానుల్లో కొందరు ఒకఅడుగు ముందుకేసి బాణసంచా పేల్చారు. కొన్ని పత్రికలు ముక్కుపుడక పెట్టుకున్న మేడమ్ ఫోటోని ముఖచిత్రంగా ప్రచురించారు. ఫ్రేమ్‌లు కట్టిన ఆ ముఖచిత్రాలు అనేక సెలూన్లలో ధగధగ మెరిశాయి. పట్టణ ప్రముఖ కూడళ్ళలో అభిమాన నిర్మాతలచే హోర్డింగ్‌లు వెలిశాయి.

నాలుగు వారాలు గడిచిందో లేదో లక్షలాది మంది ఆ వీడియోని తిలకించారు. లైక్‌లు కొట్టారు, పూల గుత్తులు విసిరారు.

ఓ 'కూల్ సండే' నాడు యూ ట్యూబ్ ఛానెల్ వారు వచ్చి మేడమ్‌కి చెక్కు ఇచ్చారు. వారి చూపులు 'ముక్కు ఇంకో వైపు కూడా మేడమ్ కుట్టించుకుంటే మరిన్ని డబ్బులు మనకి వస్తాయి కదా' అన్నట్లుగా ఉన్నాయి.

కాగా మొత్తం కార్యక్రమానికి యువనటికి అయిన చిల్లర ఖర్చు పది వేలైతే యూ ట్యూబ్ వారు ఇచ్చిన చెక్కు లక్ష పై చిలుకు.

యువనటి ముక్కుపుడక బిరడా బిగించుకుంటూ 'కాదేదీ మార్కెట్ కి అనర్హం' అని అనుకుంది.

ఓ పత్రిక ఇంటర్వ్యూలో–"నాకేమీ తెలియదు... నేనింకా అమ్మ చాటు బిడ్డనే!" అని వయ్యారాలు పోతూ చెప్పింది.

పక్కనే ఉన్న బుజ్జమ్మ ముసిముసినవ్వులు నవ్వుతూ చెక్కు వైపే చూస్తూ ఉంది.



యలమర్తి చంద్రకళ
8008915928

# తొంగితొంగి చూడు చందమామ

"వదినా! ఆ సావిత్రిని చూసావూ?... కొత్త చీర కొన్నట్టుంది. అది కట్టుకుని వీధిలో ఇప్పటికి పదిసార్లు అటూ ఇటూ తిరిగింది."

"అంతా మనం అనుకున్నట్టే జరుగుతోందిగా..."

"మొదట ఎవరు కొత్త చీర మన వీధిలో కొనుక్కుంటే వాళ్ళు అలా తిరగాలి అనుకున్నాం అదేనా?" అంది మెల్లగా.

"హుష్!... అన్నీ చెబితే కాని నీకు నిద్రపట్టదు."

"నీ కిటికీలో నుండి ప్రపంచం మొత్తం చూసేస్తావు కదే!"

"నీకూ చూపిస్తున్నానుగా... అయినా వదినా! నీకు కిటికీలు లేవా ఏంటీ?"

"మీ అన్నయ్య ఊరుకోరుగా! ఎప్పుడు చూడు ఏదో ఒకటి అని సాధిస్తుంటారు. మళ్ళీ పాటతోనో పద్యంతోనో చెబుతారు. బయటి వాళ్ళకి అర్థం కాకూడదని."

"పనిత్వరగా కానియ్యి... మనమూ వెళదాంషాపింగ్‌కి!"

"ఏమో! కుదురుతుందో లేదో, మీ అన్నయ్య అసలే చీరేస్తారాయే!" అని నవ్వింది.

"అప్పుడే వంటలు ఐపోయాయిటే? గోడదగ్గరకు చేరారు?"

"మీఅన్నయ్య చూపు పడింది. ఇంక ఎలా?... చీరే...స్తారు?... పద అని థంబ్స్ అప్ చూపించింది."

లోపల నుండి 'నిను చూడక నేనుండలేను...' పాడుతూ బయటకు ఆయన రానే వచ్చాడు.

"ఈ కాసేపటికే బెంగా?"

"అంటే కాఫీ కావాలి అని అర్థంలే!" నువ్వెళ్ళు అని సైగ చేసింది.


"ఆ వైపిక చూడకు ఒక్క క్షణం... ఇంకొక్క క్షణం...." మళ్ళీ పాట మార్చాడు.

"దీని అర్థం ఏంటీ వదినా?" కనబడకుండా వంగి అడిగింది ప్రసన్న గుసగుసగా..

"నా మొహం! త్వరగా వచ్చి, కాఫీ ఇచ్చి తగలడూ!... అని నువ్వెళ్ళు! మళ్ళీ ఆలస్యం అవుతుంది."

"అలాగే వదినా!" తనకు కావాల్సిన సమాధానం దొరికింది. తనూ నవ్వుతూ థంబ్స్ అప్ చూపించి, "కానియ్ మరి మళ్ళీ అరగంటాగి వస్తా నేనూ పులిహోర కలపాలి కదా!" వస్తున్న నవ్వాపు కుంటూ..."కుక్కర్లో ఇడ్లీలు పెట్టి వచ్చాను. ఇంకా టిఫిన్లు తినాలి!"

కుక్కర్ కూతలు విని వంటింట్లోకి వెళ్ళింది వసంత.



ఇంతలో గదిలో నుండి– "ఏయ్ వసంతా! ఇలారా!" అరిచాడు ప్రశాంత్.

"ఏంకావాలో రాజా వారికి?"

"మీ వదిన ఏంటి అంటోంది? " కోపంగా అడిగాడు.

"అబ్బా...! అన్నిటికీ కోపం ఎందుకూ? మా మాటలు వినద్దు... వింటే వివరాలు అడగొద్దు అని ఎన్నోసార్లు చెప్పాను."

"అదేంటి గొడవ పడుతుంటే... చూస్తూ ఊరుకోనా?"

"అయ్యో! మేం ఎప్పుడు గొడవ పడ్డాము? గొడవా లేదు... గోంగూరా లేదు!"

"ఆవిడ చీరేస్తారు అని అనడం... నేను విన్నాను."

"చీరేస్తారు అంటే చీరెలు ఆరేస్తారు... అని మా కోడ్ భాష!" అంటూ నవ్వింది.

"కావాలంటే చూడండి!" బెడ్రూంలో కిటికీ ప్రక్కన నిలబడి కొద్దిగా కర్టెన్ తీసి...

భర్తని ఇలారండీ... అంటూ సైగతో పిలిచి, నోటి మీద వేలుంచి చూపించింది మాట్లాడద్దు అని.


మాట్లాడకుండా కిటికీ మూలన కర్టెన్ కొంచెం పైకి తీసి తొంగి చూసాడు.

అతని కనుబొమలు ముడిపడ్డాయి.

ముఖం కోపంతో కందగడ్డలా మారింది.

బొత్తిగా మొగుడంటే భయం, భక్తి లేకుండా తయారయ్యారు."

"ఇప్పుడేమయ్యింది!?"




"ఆయన ఆరేస్తున్నాడేం... ఆవిడ గారి చీరలు?"

"ఉష్! మాట్లాడద్దు అన్నానా! ఇలా రండి!"

సోఫాలో కూర్చుని..."వాళ్ళిష్టం ఏదయినా చేసుకుంటారు! మనకేల ఆ గోల!... అసలు మొన్న ఏమయ్యిందో తెలుసా? చీర ఆరేయ బోయి చేతకాక అది కాస్తా కింద పడేసాడు అన్నయ్య. అప్పుడు చూడాలి ఆఁహాఁ...!"

"ఇంకేముంది యుద్ధం జరిగిందా? ఆవిడ సత్యభామలా కాలితో తాన్నిందా?"

"అబ్బా! మీలాగా కాదు. అన్నయ్య భలే రొమాంటిక్!"

"ఆ డాబా మీదే?... ఏం చేసాడు? అయినా ఛీ! ఛీ... నువ్వు అవన్నీ చూడ్డం ఏమిటి?"

"అంతేమీ లేదు మీరు మీ చెత్త ఐడియాలతో ఏవో ఊహించుకోకండి."

"మరి నువ్వేంటి తెగ ఊరిస్తున్నావ్ చెప్పి తగలడు."

"ఎన్టీఆర్‌లా... స్టెప్‌లు వేస్తూ 'ఆరేసుకో బోయి, పారేసుకున్నాను హరీ...' అని అందు కుని దీనంగా చూసాడు."

అప్పుడు మీ వదిన ఏం చేసిందో చెప్పనా! చెప్పేస్తున్నా... అట్టా సూడమాకయ్యా అని... చటుక్కున అన్నయ్యకి ముద్దు పెట్టేసింది. కదూ! ఛీ!" అంటూ కిటికీ దగ్గర కెళ్ళి తొంగి చూసాడు.


"అది నిన్నటి సంగతి! ఛీ అన్న వాళ్ళు తొంగి చూడటం ఎందుకో?" వసంత మూతి తిప్పుకుని వెళ్ళి పోయింది.


"సరేలే వీళ్ళు ఉద్ధరించే ఘనకార్యాలు ఇవా?" అంటూ... ఏదో పని ఉన్నట్లు కిటికీ దగ్గరే తచ్చాడుతూ, మధ్య, మధ్యలో తొంగి చూస్తున్నాడు ప్రశాంత్.

అవును పులిహోర కలపాలి అన్నావేంటి? ఈరోజెందుకు?"

"సరదాగా పని తొందరగా అవ్వాలంటే పులుసు కలపాలి కదా! అది మొదలు పెట్టాను లేండి."

"పులిహోర అంటే... పండగపూట పని పెరుగుతుంది అంటావు కదా! మరి ఈరోజు అన్నీ విచిత్రంగా మాట్లాడుతున్నావు! తొంద రగా అవుతుందని అంటున్నావేం?






"ఈ రోజేంటి తీరుబాటుగా వున్నారు? పులి హోర వద్దంటే మానేస్తాను." కిటికీ దగ్గర కెళ్ళి తొంగి చూసి చెయ్యి ఊపింది.

"వదిన రమ్మంటోంది. అలా వెళ్ళి వస్తాము! బజారు నుండి ఏమన్నా కావాలా మీకు?"

"ఈవేళప్పుడు బయటికి ఎందుకే?"

"కొత్త మాల్ తెరిచారు కదా! వెళ్ళివస్తాం. కాస్త వాకింగ్ చేసినట్లు ఉంటుంది."

"ఇప్పుడు వాకింగ్...మాల్‌లోనా?"

"ఎప్పుడయినా వాకింగ్, వాకింగే కదా!... పైగా చీర కొత్తదయితే బావుంటుంది. పాత బడిపోతే అంత సరదా ఏముంటుంది." నోరు జారింది వసంత.

"చీరేంటి?...పాత బడటం ఏంటి?"

"అయ్యో! వదినతో మాట్లాడినట్లే మీతో మాట్లాడేస్తున్నాను. మీకు మా కోడ్ భాష అర్థం కాదులేండి."

"ఎప్పుడొస్తావు అదయినా సరిగ్గా చెప్పు."

"అయ్యో వంట చెయ్యాలిగా గంటలో వచ్చేస్తాము!"

"గంటలో ఏం వస్తారులే?"

"బియ్యం, పప్పు కడిగి, కూర తరిగి కుక్కర్లో పెట్టేసాను. వెలిగించి మూడు కూతలు రానిస్తే చాలు."

"నేను వండి తగలెస్తాను. పోపులడబ్బా అది బయట పెట్టు."

"పోపుల డబ్బాలోనే అంతా వుంది... తియ్యాలి! మా జీవితాలు అలాగే గడచి పోవాలి కదా."

"ఏం తియ్యాలే?"

"అదే అందులోకి... అన్నీ తేవాలి కదా అంటున్నాను."

"సరే... ఏదో కాని వెళ్ళు. నాకో తలనొప్పి బిళ్ళ తీసుకురా... నీ కోడ్ ఏమో కాని, నాకు అర్థమయ్యి చావట్లేదు."

"అయ్యో! అవునా? ఓ స్ట్రాంగ్ కాఫీ ఇస్తాను. మీ తలనొప్పి హుష్ కాకి అన్నట్లు పారి పోదూ...."

ప్రశాంత్, పక్కింటి గోడదగ్గరకు వెళ్ళి–

"ఏంటీ బావా వీళ్ళ గోల! నీకు ఏమన్నా అర్థమయ్యిందా?"

"ఆడవారి మాటలకు అర్థాలు వేరు. మాట విప్పి చూడ మూర్ఛ వచ్చు... ఇంతి సంగతి ఇంతింత కాదయా... విశ్వమంత ఇంతె వినర భర్త !" యోగి వేమనలా చెప్పాడాయన.

అమ్మో, అది కోడ్‌తో కొడుతోంది. ఈయన పద్యాలతో కొట్టేస్తున్నాడు. వస్తా బావా!" అని అక్కడి నుండి జారుకున్నాడు.

ఈయన్ని అడగటం ఇంకో పెద్ద తప్పులా వుంది.


లోపల కిటికీలోంచి చూడటమే నయం.

"ఏమేవ్ కాఫీ కాయడం అయితే... నా మొహాన తగలెయ్యి!" గట్టిగా అరిచాడు.

## పదాలతో ఆడుకుందాం....రండి!

**తెలుగుభాషాప్రియులను అలరించే**

**యాభై పజిల్స్‌తో ఈ పుస్తకం విడుదలైంది!**




116పేజీల ఈ పుస్తకం వెల 125 రూపాయలు మాత్రమే!
ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా 125 రూపాయలు పంపితే
కొరియర్‌లో ఈ పుస్తకం పంపుతారు (కొరియర్ చార్జీలు ఫ్రీ).
మరిన్ని వివరాలకోసం ఈ కింది ఫోన్ నెంబర్లను
సంప్రదించగలరు–

**9849630637, 9676444548**




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. సుబ్బారావు, అప్పన్నలు ఒక పార్టీకి వెళతారు. అక్కడోహత్య జరగుతుంది. ఆ విషయమై ఇద్దర్నీ పోలీసులు ఎన్క్వైరీ చేస్తుంటారు. **ఆ తర్వాత.....**

**ప్రస్తుతం...**

**ఇద్దరూ, గబగబా బ్రెడ్డు, జాము నోట్లో కుక్కుకొని కసాబిసా నమిలి మింగేసి, గుటుక్కున నీళ్లు తాగి, పెద్ద సార్ అని పిలవబడే...ఇంగ్లీష్ పోలీస్ అధికారి టెంట్ ముందుకొచ్చి నిలబడ్డారు.**

**అక్కడ ఇద్దరు నిజాం సైనికులు ఉన్నారు. బ్రిటీష్ అధికారి బయటికి వచ్చి-**

**"బ్రెడ్డూ, జాము మీ మూతులకు ఇంకా అలాగే ఉన్నాయి. ముందు తుడుచుకోండి." అన్నాడు.**

**ఇద్దరూ గబగబా మూతులు తుడుచుకుని..."సారీ సర్!" అన్నారు.**

**"నిన్న నిజాం రాజు ఇచ్చిన డిన్నర్‌కు మీరు వెళ్ళారు కదా!" అన్నాడు.**

**"చిత్తం! తమరి పర్మిషన్ తీసుకునే వెళ్లాం కదా సార్!" అన్నాడు సుబ్బారావు.**

"ఎస్! అఫ్‌కోర్స్!! ఐతే...నిన్న డిన్నర్‌లో ఏదో గలాటా జరిగిందట కదా! ఏంటి ఆ గలాటా? చికెన్ ముక్కలు సరిగ్గా ఉడకలేదని ఎవరైనా గలాటా చేసారా?"

"లేదు సార్! వేరే గలాటా..."

"దాని గురించి విచారించడానికి నిజాం రాజు గారి ప్రధానమంత్రి మిమ్మల్ని పిలుచుకురమ్మని సందేశం పంపారు. వెంటనే వెళ్ళి రండి... 11 గంటలకు మనం ట్రైనింగ్ కోసం వికారాబాద్ అడవికి బయల్దేరాలి. తెలుసు కదా?"

"తెలుసు సార్! వెంటనే వెళ్ళి... పదింటికల్లా ఇక్కడికి వస్తాం!" అని సుబ్బారావు, అప్పన్న

నిజాం ప్రధానమంత్రి పంపిన కారులో సర్దార్ మహల్‌కు వెళ్ళారు.

క్రితం రోజు పార్టీకి వచ్చిన వారిని..అక్కడ విచారిస్తున్నారు.

వీరు, నిజాం రాజు తాలూకు ప్రధానమంత్రి గదిలోకి వెళ్ళి నమస్కారం పెట్టి నిల్చున్నారు.

ఆ గదిలో ఖరీదైనా వస్తువులు ఉన్నాయి.

గోడ వెనక... పులి తల, తుపాకులూ వేలాడుతున్నాయి. నిజాం ప్రధానమంత్రి ముస్లీములు ధరించే జుబ్బా ధరించి ఉన్నాడు. నెత్తి మీద టోపీ... కోల మొహం, బారెడు గెడ్డం.

"బైఠియే..కూర్చోండి."

ఇద్దరు, ఆయన ఎదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నారు.

"ఆప్... అంటే మీరు... కల్...అంటే నిన్న, రాత్...అంటే రాత్రి, హమారా...అంటే మా, మెహమాన్...అంటే అతిధులు. లేకిన్...అంటే కానీ, ఆజ్...అంటే ఈ రోజు, ముష్తబాహ్రాద్...అంటే అనుమానితులు." అన్నాడు ప్రధాన మంత్రి.

సుబ్బారావు,అప్పన్న మొహామొహాలు చూసుకున్నారు.

"పై పదాన్ని, అనువాదం చేయక్కర్లేదు సార్. నాకు ఉర్దూ వచ్చు!" అన్నాడు సుబ్బారావు.

"అంటే... మీరు మాత్రమే అని కాదు. పార్టీకి వచ్చిన వాళ్లందరూ అనుమానితులే... చూసారుగా! ఆమె మీద ఎవరో బాకు విసిరారు. 56 వజ్రాలున్న ఆమె నెక్లెస్ పోయింది. అందరినీ విచారిస్తున్నాం. కొందరిని..ఇతర మంత్రులు,



మా సైనికుల సహాయంతో విచారిస్తున్నారు. మీరు మా హైదరాబాద్ స్టేట్‌లోని వాళ్ళు కారు. బ్రిటీష్ పాలనలో ఉన్న...మద్రాస్ ప్రెసిడెన్సీ కింద ఉన్న ఆంధ్రా ప్రాంతంలోని వాళ్ళు. మేము, బ్రిటీష్ వాళ్లకు కప్పం కడతాం... పైగా మీరు పోలీసులు. అందుకే అత్యంత గౌరవంగా మిమ్మల్ని నేను విచారిస్తున్నాను. ఆ వజ్రాల హారాన్ని మీరు చూసారా?"

సుబ్బారావు, అప్పన్న మొహమొహాలు చూసుకొని–"లేదు సార్!" అన్నారు.

"అంటే... కిందపడడం కానీ, ఎవరైనా ఆ హారం దొంగిలించడం చూసారా?"

"లేద్సార్!"

"పార్టీలో ఎవరైనా అనుమానంగా కదలడం గమనించారా?


"లేద్సార్!" అన్నాడు సుబ్బారావు.

ప్రధాని, అప్పన్న వైపు చూసాడు.

"ఎవరినైనా, అనుమానితులను పార్టీలో చూస్తే, చెప్పండి!" అన్నాడు సుబ్బారావు అప్పన్నతో.

"సార్! ఒక పొట్టి వ్యక్తి, నిన్న ఉదయం నుండీ మమ్మల్ని వెంటాడాడు సార్! నిన్న పార్టీలో... అంటే ఆ కారిడార్‌లో కనిపించాడు సార్. మేము చార్మినార్ వెళితే చార్మినార్, గోల్కొండ వెళితే గోల్కొండా వచ్చాడు. కానీ, మమ్మల్ని ఎందుకు ఫాలో అయ్యాడో తెలియదు సార్!" అన్నాడు అప్పన్న.

ప్రధాని బెల్ కొట్టాడు.




ఒక సైనికుడు లోపలికి వచ్చాడు.

"చోటే మియా కో బులావో!" అన్నాడు.

ఆ సైనికుడు బయటికి వెళ్ళిన ఐదు నిమిషాలకు, చోటేమియా లోపలికి వచ్చాడు.

అతడిని చూసి, అప్పన్న, సుబ్బారావు అదిరిపడ్డారు. తమను క్రితం రోజు వెంటాడిన వ్యక్తి అతడే.

"ఇతను మా గూఢచారి. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే...వెంటాడతాడు. ముఖ్యంగా ఆంధ్రా వైపు నుండి ఎవరైనా పోలీసులో, రాజకీయ నాయకులో వస్తే ఇవి తప్పవు. మా జాగ్రత్తలో మేము ఉంటాం! మాది సపరేట్ రాజ్యం కదా....అందుకే!" అన్నాడు ప్రధాని.

అప్పన్న, సుబ్బారావు, 'మా భయాలు మా కుంటాయి అని చెప్పక... మా జాగ్రత్తలో మేముంటాం అంటావేంటి?' అనుకున్నారు తమ మనసులలో.

"చెప్పండి! ఎవరినైనా అనుమానితులను చూసారా?" మళ్ళీ అడిగాడు ప్రధాని.

"లేదు!" అన్నారు ఇద్దరు.

ప్రధాని ఏదో ఆలోచిస్తున్నట్లు మౌనంగా ఉండిపోయాడు.


"ఇంకా మీరు మమ్మల్ని అనుమానిస్తున్నారా?" అన్నాడు సుబ్బారావు.

"........"

"మాకసలు ఆ నెక్లెస్ గురించి నిన్ననే తెలిసింది. పైగా, మేమసలు మీ పార్టీకి వస్తామనే విషయమే మాకు నిన్న గోల్కొండ వెళ్లేంత వరకూ తెలియదు. అసలు ఆ గుర్రం పిచ్చెత్తినట్లు పిల్లల్ని తీసుకొని పారిపోతుంటే, మేము కాపాడాం. దానితో మాకు ఆ పిల్లల తల్లి, నిన్న రాత్రి పార్టీకి రమ్మని ఆహ్వానించింది... అందుకే పార్టీకి వచ్చాం తప్ప, వేరే దురుద్దేశ్యంతో కాదు!" అన్నాడు సుబ్బారావు.

"అందుకే అనుమానించాల్సి వస్తోంది. ఒకే రోజు అన్ని సంఘటనలు ఎలా జరుగుతాయి. పుస్తకాలల్లో తప్ప!" అన్నాడు ప్రధాని.

"అంటే... మేము ఇక్కడ పోలీస్ ట్రైనింగుకు రాకముందే ఆవిడేవరో నెక్లెస్ వేసుకొస్తారని తెలిసి ప్లాన్ చేసుకొచ్చాం అంటారా? ఇంకా



నయం...ఆ గుర్రానికి పిచ్చెత్తినట్లు ప్రవర్తించడానికి కూడా మేమే కారణం అన్నారు కాదు!" అన్నాడు అప్పన్న.

"ఎందుకు కాకూడదు?" అన్నాడు ప్రధాని.

"ఎప్పుడో బ్రిటీష్ వారికి తిక్క పుట్టి, మీ హైదరబాద్ స్టేట్‌ను కూడా తమ హస్తగతం చేసుకొని... హైదరాబాద్ ప్రెసిడెన్సీ అని పేరు పెడతారేమో అని మీ భయం! లేదా...ఏ విప్లవాలో చెలరేగి మీ రాజ్యాన్ని కూలదూస్తారేమోనని మీ భయం. ఆ భయాలతో.. అన్నిటినీ, అందరినీ అనుమానించడం మీకు అలవాటుగా మారింది!" అన్నాడు సుబ్బారావు ధైర్యంగా.

ఈ మాట అన్నది తమ రాజ్యంలోని వాడు అయ్యుంటే, ఈ పాటికి అతని వొంట్లో బుల్లెట్లు దిగేవి.

ప్రధాని, తనకొచ్చిన కోపాన్ని దిగమింగుకొని– "మీరు ఇక వెళ్ళొచ్చు! అవసరమైతే మళ్లీ పిలుస్తాం! విచారణకు రావాల్సి ఉంటుంది!" అన్నాడు.

"మేము దొంగలం కాము! పోలీసులం. మీ రాజ్యానికి మాకు ఏ సంబంధం లేదు. అయినా సరే, తప్పక మేము మీకు సహ కరిస్తాం!" అన్నాడు సుబ్బారావు ఉర్దూలో.

అప్పన్న, సుబ్బారావు ఇద్దరూ పైకి లేస్తుండగా...ఓ సైనికుడు లోపలికి పరుగెత్తుకొచ్చాడు.

"సాబ్! దొంగ దొరికాడు... పట్టుకున్నాం!"

ప్రధాని వెంటనే తన కుర్చీలో నుండి లేచాడు.

"వెళ్లి... దొంగను సత్కరించండి.... మమ్మల్ని అవమానించారుగా!" అన్నాడు సుబ్బారావు ఉర్దూలో.

"సారీ!" అనేసి ప్రధాని బయటకు పరుగుపరుగున వెళ్ళాడు.

"ఉర్దూలో ఏం చెప్పారు?"అడిగాడు అప్పన్న.

"దొంగ దొరికాడట. పదండి... ఇక్కడ మనకు ఇంకేం పని!" అన్నాడు సుబ్బారావు.

ఇద్దరు, బయటకు వచ్చారు.

## ఫొటో టూన్

రఘు




కారిడార్ లో సైనికులతో మాట్లాడుతున్న ప్రధాని, వీరిని కారులో పరేడ్ గ్రౌండ్స్ దగ్గర దింపమని డ్రైవర్ కు చెప్పాడు.

ఆ తర్వాత, వీరి దగ్గరికొచ్చి–"సారీ! దొంగ దొరికాడు. మన మధ్య జరిగిన సంభాషణ, బ్రిటీష్ అధికారులకు చెప్పి...మాకు, వాళ్లకు మధ్య పొర పొచ్చాలు రాకుండా చూసుకోండి!" అన్నాడు ప్రధాని.

తలూపాడు సుబ్బారావు.

ఇద్దరిని, కారులో పరేడ్ గ్రౌండ్స్‌లో దింపారు.


వికారాబాద్ అడవుల్లోకి ట్రైనింగ్ వెళ్లడానికి సిద్ధంగా ఉన్న తమ పోలీసు బృందంతో కలిసారు.

✦✦✦

ప్రధాని,మరో ఇద్దరు మంత్రులు, సైన్యాధ్యక్షుడు, నలుగురు సైనికులు ఆ గదిలో ఉన్నారు.

వారి మధ్యలో దొంగ, నిలబడి ఉన్నాడు.

వాడి జుట్టు రేగిపోయి ఉంది... మొహం పీక్కుపోయి... నిద్రలేక వేలాడుతున్నట్లుగా ఉంది. **(సశేషం)**






Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# తెలుగు కార్టూనిస్టులకు, తెలుగు భాషాభిమానులకు సాదర ఆహ్వానం

## తాపీ ధర్మారావు పురస్కారం-2022,

## 'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' -సరసి కార్టూన్ల పుస్తకం విడుదల



తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభంపై వందలాది
వ్యంగ్య చిత్రాలను సృష్టించిన ఏకైక కార్టూనిస్టు

**మన సరసి గారికి**

**తాపీ ధర్మారావు పురస్కారం- 2022**

తేదీ: నవంబరు 5, 2022, శనివారం.
సమయం: సా॥ 5.30 గంటలకు
వేదిక: ఒకటవ అంతస్తు, హోటల్ ఐలాపురం, గాంధీనగర్, విజయవాడ



**తెలుగు భాషోద్యమ కార్టూనిస్టు**

**'సరసి'**

వివిధ సామాజిక సమస్యలపై వేలాది కార్టూన్లతో ప్రజల్లో చైతన్యం కలిగించిన చిత్రకారుడు. పాలనా బోధనా రంగాలలో తెలుగుకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ తన కార్టూన్లతో ప్రభుత్వాల్లో, ప్రజల్లో కదలిక తెచ్చిన అనుపమాన వ్యంగ్య చిత్రకారుడు-సరసి.

ముఖ్యఅతిథి, పురస్కారం అందజేయువారు:
**గౌ॥జస్టిస్ ఎ.వి.శేషసాయి,** ఆం.ప్ర. హైకోర్టు న్యాయమూర్తి

విశిష్ట అతిథి, పుస్తక ఆవిష్కర్త:
**డా॥ మండలి బుద్ధప్రసాద్,** రాష్ట్ర మాజీ ఉపసభాపతి

ఆత్మీయ అతిథులు:
**శ్రీ'బాచి',** కార్టూనిస్టు(శ్రీఅన్నం శ్రీధర్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్)
**ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు,** తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు

సభాధ్యక్షులు: **డా॥ సామల రమేష్ బాబు** 'అమ్మనుడి' సంపాదకులు

స్వాగతం: **శ్రీ తమ్మా శ్రీనివాసరెడ్డి** ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్

తెలుగుజాతి (ట్రస్టు)

నిర్వాహకులు
వెన్నిసెట్టి సింగారావు
సామల లక్ష్మణబాబు,
'తెలుగుజాతి'(ట్రస్టు)

తాము సకాలమునకు విచ్చేసి సభను విజయవంతం చేయగోరుతున్నాం.




## తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు


డా॥నాగసూరివేణుగోపాల్2009


డా॥కె.శ్రీనివాస్-2011


శ్రీ టంకశాల అశోక్-2013



శ్రీ జి.శ్రీరామమూర్తి-2014


శ్రీ ఎ.కృష్ణారావు-2015


శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016


శ్రీసతీష్‌చందర్-2017


డా॥ ఏటుకూరి ప్రసాద్
జీవనసాఫల్య పురస్కారం-2018


శ్రీ వై.ముకుందరామారావు-2020


శ్రీమతి డి.పి.అనురాధ-2021

Hasyanandam November 2022. RNI No. APTEL 08387/01/1/2003-TC



రండి! దర్శించండి!! తరించండి!!!

# శ్రీ అష్టాదశ శక్తిపీఠ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం

కీ॥శే॥ శ్రీ గట్టు రాం రాజేశం గుప్తగారి సత్సంకల్పముతో...

గౌ॥ శ్రీమాన్ కె.వి.రమణాచారి IAS, Retd గారి పర్యవేక్షణలో...

## ఆనంద నిలయం ఆవరణలో
## గ్రా॥ కొండపాక. జి॥ సిద్ధిపేట

అమ్మవారి అనంతరూపాలలో అష్టాదశ శక్తి స్వరూపాలు అత్యంత శక్తివంతమైన రూపాలు. ఒక్కో రూపం ఒక్కోరకంగా ప్రభావవంతమైనది. అమ్మవారి ఆవిర్భావంతో, మన భారతావని పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుచున్నది. అంతటి గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో సిద్ధిపేట జిల్లాలోని కొండపాక గ్రామంలో ఆగమశాస్త్ర విధానంలో వాస్తురీత్యా చక్కని శిల్పసంపదతో నాణ్యత గల నిర్మాణముతో శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాదీశ్వరుల.... ఆశీరనుగ్రహ నిర్వహణలో త్యాగధనుల విరాళములతో ఒక అద్భుతమైన అష్టాదశ శక్తి క్షేత్రంగా శాస్త్రీయ విధానంగా అతి త్వరలో వైభవోపేతంగా ప్రతిష్ఠింపబడుతున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాం. ఇంకా నిర్మాణంగా నున్న, రాజగోపురం, ధ్యాన మండపం, యజ్ఞశాల, వంటశాల, అర్చకుల గృహసముదాయం, భక్తులకు నివాస వసతి గృహసముదాయం అనేక హంగులతో సొబగులతో నిర్మించుటకు సంకల్పించినాం. ఇంతటి గొప్ప విశిష్ఠత గల వైభవోపేతమైన ఈ శాస్త్రీయ అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు, దాతలు యధామతిగా యథారీతిన తమ తమ శక్త్యానుసారంగా తను, మన, ధన, సేవా సహకారాలందించి ఈ పవిత్ర పుణ్యకార్యక్రమంలో యధోచితంగా పాల్గొనగలరని సకల భక్తజనావళిని సాదరపూర్వకంగా ఆశిస్తూ ఆహ్వానిస్తున్నాం.

**ఆలయ ట్రస్టు సభ్యులుగా చేరడానికి రూ.3,00,000 విరాళం అందించి**
**శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కండి!**

ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు ఇన్‌కంటాక్స్ 80-జి సెక్షన్ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.

**Provisional Approval Number AAHTA 8091JF20206**

Ashtadasha Shakthi Peetha Sahitha Ramalingeswara Swamy Charitable Trust,
A/C.No-39153802660, IFSC-SBIN005881, Branch: SBI, ADB, Siddipet

వివరాలకు సంప్రదించండి:

శ్రీ అయిత నాగరాజు-9583599999, శ్రీ పెద్ది వైకుంఠం-9440003943, శ్రీ గట్టు రవీందర్-9848504656